వీలేకరులు కావలెను
తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వెలుబడుతున్న
ప్రజా స్వేచ్ఛ
PRAJA SWECHA
రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక
తెలుగు మాసపత్రిక నందు పనిచేయుటకు
జర్నలిజంపై ఆసక్తి కలిగిన ప్రతి మండలం నుండి విలేఖరులు కావలెను
ఆసక్తి గలవారు సంప్రదించండి
+91 9381910611 , 7989289492

www.prajaswecha.com

# ప్రజా స్వేచ్ఛ

PRAJA SWECHA
రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక




హైదరాబాద్ | సంచిక : 1 | సంపుటి : 218 | ఎడిటర్ : తరిగొప్పుల లక్ష్మి మహేందర్ ప్రజాపతి | ఫిబ్రవరి 2025 | వెల : రూ 10/-




## నేడు ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు

- పకడ్బందీ ఏర్పాట్లు చేసిన ఎన్నికల సంఘం
- హ్యాట్రిక్ విజయం సాధించాలని ఆప్ పోరాటం


**న్యూఢిల్లీ,**
బుధవారం ఢిల్లీలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. మొత్తం 70 అసెంబ్లీ స్థానాలకు ఒకే విడతలో పోలింగ్ నిర్వహించనున్నారు. ఢిల్లీ ఎన్నికల కోసం కేంద్ర ఎన్నికల సంఘం ఇప్పటికే అన్ని ఏర్పాట్లు -మిగతా 3 లో



## పార్టీ మారిన ఎమ్మెల్యేకు షాక్

- సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు నోటీసులు

**హైదరాబాద్**
పార్టీ మారిన ఎమ్మెల్యేకు షాక్ తగిలింది. సుప్రీంకోర్టు ఆదేశాలతో పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలకు నోటీసులు జారీ అయ్యాయి. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన 10 మంది ఎమ్మెల్యేలకు అసెంబ్లీ కార్యదర్శి నోటీసులు జారీ చేశారు. పార్టీ ఫిరాయింపులపై లిఖిత పూర్వక సమాధానం చెప్పాలని నోటీసుల్లో పేర్కొన్నారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని సుప్రీంకోర్టును -మిగతా 3 లో




### కులగణన సర్వేపై సభలో



## వాడీవేడీ చర్చ

- బిసిలకు పథకాల్లో లబ్ది చేకూర్చాలన్నదే లక్ష్యం
- పార్టీ పరంగా స్థానిక ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు ఇస్తాం
- విపక్ష పార్టీలు ఇందుకు సిద్దంగా ఉన్నాయా చెప్పాలి
- దేశంలోనే తొలిసారిగా కులగణన సర్వే చేపట్టాం
- నివేదికను అసెంబ్లీలో ప్రవేశ పెట్టిన సీఎం రేవంత్ రెడ్డి
- కులగణన సర్వేపై రాజకీయాలు చేయొద్దన్న మంత్రి పొన్నం


**హైదరాబాద్,** బిసి కులగణన సర్వేపై తెలంగాణ అసెంబ్లీలో వాడీ వేడి చర్చ జరిగింది. ప్రతిపక్ష ఎమ్మెల్యేలు చేసిన ఆరోపణలను సీఎం రేవంత్‌రెడ్డి తిప్పికొట్టారు. భారాస నేతలు సర్వేలో ఎందుకు పాల్గొనలేదని నిలదీశారు. -మిగతా 3 లో



## నేడు ప్రయాగ్ రాజ్ కు ప్రధాని

- త్రివేణి సంగమంలో స్నానం ఆచరించనున్న మోడీ

**న్యూఢిల్లీ,**
ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న అతిపెద్ద ఆధ్యాత్మిక వేడుక మహా కుంభమేళాలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ బుధవారం పాల్గొనన్నారు. ఆయన త్రివేణీ సంగమంలో పుణ్యస్నానం ఆచరించనున్నట్లు సమాచారం. ఈమేరకు ప్రధాని షెడ్యూల్‌ను ఓ సీనియర్ ఐపీఎస్ అధికారి చెప్పినట్లు -మిగతా 3 లో




## తిరుమలలో వైభవంగా రథసప్తమి

- స్వతవాహనసేవల్లో అనుగ్రహించిన శ్రీవారు
- శ్రీవారిని దర్శించుకున్న వేలాదిమంది భక్తులు

**తిరుమల,**
తిరుమలలో రథసప్తమి వేడుకలు వైభవంగా సాగాయి. దేవదేవుడిని దర్శించుకునేందుకు వేలాదిగా భక్తులు రతలి వచ్చారు. వామన సేవల్లో పాల్గొన్నారు. మాడవీధులు గోవింద నామస్మరణతో మారుమోగాయి. రథసప్తమి సందర్భంగా శ్రీనివాసుడు సప్తవాహనాల్లో -మిగతా 3 లో

## తెలంగాణ సచివాలయానికి బాంబు బెదిరింపు



**హైదరాబాద్**
తెలంగాణ రాష్ట్ర సచివాలయానికి బాంబు బెదిరింపు కాల్స్ వచ్చాయి. మూడు రోజులుగా గుర్తు తెలియని వ్యక్తి నుంచి బెదిరింపు కాల్స్ వస్తున్నాయి. బెదిరింపు కాల్స్ నేపథ్యంలో పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహించగా ఎక్కడా బాంబు లేదని తేల్చారు. ఈ ఫోన్ కాల్స్ ఎక్కడి నుంచి -మిగతా 3 లో

## కులగణనకు కేబినేట్ ఆమోదం

- అన్ని రాష్ట్రాల్లో ఈ డిమాండ్ వస్తుందని వెల్లడి
- ఫిరాయింపుదారులకు నోటీసులు రొటీన్ ప్రాసెస్
- కేటినేట్ భేటీలో సీఎం రేవంత్ రెడ్డి కామెంట్స్



**హైదరాబాద్,**
:తెలంగాణలో ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపు వ్యవహారం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలకు -మిగతా 3 లో



## వికసిత్ భారత్ తమ ధృడ సంకల్పం


### ఆ లక్ష్యం దిశగా పయనిస్తున్నాం

- రాష్ట్రపతి ప్రసంగంలో ఇదే స్పష్టం చేశాం
- రాబోయే 25 ఏళ్ల కాలానికి ప్రజల్లో విశ్వాసం పాదుకొల్పాం
- తప్పుడు హామీలతో ప్రజలను మోసం చేయడం లేదు
- కొందరు సెల్ఫీలు దిగుతూ..అద్దాల మేడల్లో ఉంటారు
- ప్రతి రూపాయి గ్రామానికి చేరుకునేలా చూస్తున్నాం
- రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాద తీర్మానానికి మోడీ సమాధానం

**న్యూఢిల్లీ,**
రాష్ట్రపతి ప్రసంగం 'వికసిత్ భారత్' లక్ష్యంపై దేశ దృఢసంకల్పాన్ని పునరుద్ఘాటించిందని ప్రధాని మోడీ అన్నారు. రాష్ట్రపతి ప్రసంగం తమలో ఆత్మవిశ్వాసం నింపిందని, మరోసారి తమ ప్రభుత్వాన్ని ఎన్నుకున్నందుకు ప్రజలకు కృతజ్ఞతలని చెప్పారు. రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాద తీర్మానానికి పధ్నాలుగు సార్లు సమాధానం ఇచ్చే అదృష్ట్యాన్ని దేశ ప్రజలు తనకు ఇచ్చారని, ఇందుకు తాను ప్రజలందరికీ కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. పార్లమెంటులో రాష్ట్రపతి చేసిన ప్రసంగంపై -మిగతా 3 లో

## గ్రూప్ 1 రిజల్ట్స్ కు లైన్ క్లియర్

- పిటిషన్ లు కొట్టివేసిన సుప్రీంకోర్టు




**హైదరాబాద్,**
తెలంగాణ రాష్ట్రంలో టీజీపీఎస్సీ గ్రూప్ 1 మెయిన్స్ ఫలితాలకు మార్గం సుగమమైంది. ఈ ఫలితాల విడుదలకు అడ్డుగా ఉన్న రెండు కేసులను సుప్రీంకోర్టు కొట్టేసింది. దీంతో వచ్చే 10, 12 రోజుల్లోనే గ్రూప్ 1 మెయిన్స్ ఫలితాలను విడుదలకానున్నాయి. ఈ మేరకు -మిగతా 3 లో

# యధాతథంగా పాతపన్ను విధానం


## రద్దు చేసే ఆలోచన లేదన్ననిర్మలా సీతారామన్



**న్యూఢిల్లీ,**
యధాతథంగా పాతపన్ను విధానం ఉంటుందని, దానిని రద్దు చేసే ఆలోచన లేదని ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. కొత్త పన్ను విధానాన్ని మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దిన నేపథ్యంలో పాత పన్ను విధానాన్ని రద్దు చేస్తారన్న ప్రచారం నేపథ్యంలో దీనిపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పందించారు. పాత పన్ను విధానం రద్దు చేసే ఆలోచన లేదని స్పష్టం చేశారు. ఇండియాటుడే- బిజినెస్‌టుడే నిర్వహించిన 2025 రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న సందర్భంగా దీనిపై మాట్లాడారు. 'పన్ను చెల్లింపుదారులందరూ కొత్త పన్ను విధానంలోకి మారాలని మీరు భావిస్తున్నారా?' అంటూ ఎదురైన ప్రశ్నకు నిర్మలా సీతారామన్ స్పందిస్తూ.. పాత పన్ను విధానం రద్దు చేయాలన్న ప్రతిపాదన తమ వద్ద లేదన్నారు. పన్ను ఫైలింగ్ విధానం సరళంగా ఉండాలనే ఉద్దేశంతో కొత్త పన్ను విధానం తీసుకొచ్చినట్లు చెప్పారు. కొత్తగా తీసుకురాబోయే ఆదాయపు పన్ను చట్టం గురించి కూడా ఈ సందర్భంగా ప్రస్తావన వచ్చింది. 1961లో తీసుకొచ్చిన పాత ఆదాయపు పన్ను చట్టం స్థానంలో అనేక మార్పులు, చేర్పులతో కొత్త ఆదాయపు పన్ను చట్టాన్ని ప్రవేశపెట్టనున్నట్టు వెల్లడించారు. మరికొద్ది రోజుల్లో ప్రవేశపెట్టబోయే ఈ బిల్లు పార్లమెంటులో ఆమోదం పొందుతుందని భావిస్తున్నట్లు ఆమె తెలిపారు.


# హైదరాబాద్‌లో హాస్టల్ నిర్వాహకుడి అరాచకం

## యువతిని వీడియోలు చూపి బ్లాక్‌మెయిల్



**అమరావతి,**
హైదరాబాద్‌లో హాస్టల్ నిర్వాహకుడి అరాచకం బయటపడింది. వీడియోలతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగినికి బెదిరింపులకు పాల్పడిన సంఘటన వెలుగు చూసింది. యువతి న్యూడ్ వీడియోలు తీసి బ్లాక్‌మెయిల్‌కు పాల్పడ్డాడు. అంతే కాదు యువతిని బెదిరించి ఏకంగా రూ.2.53 కోట్ల వరకు వసూలు చేశాడు. దీంతో బాధితురాలు నిడదవోలు పోలీసులను ఆశ్రయించింది. నిందితుడు దేవనాయక్ అలియాస్ మధు సాయికుమార్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. తూర్పుగోదావరి జిల్లా నిడదవోలుకు చెందిన బాధిత యువతి హైదరాబాద్‌లోని విప్రో సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నది. యువతి ఉంటున్న ఉమెన్స్ హాస్టల్‌లో అనూష దేవి అనే చిన్ననాటి స్నేహితురాలితో పరిచయం ఏర్పడింది. దేవనాయక్ అలియాస్ మధు సాయికుమార్‌ను యువతికి తన భర్తగా పరిచయం చేసిది అనూష దేవి. దేవ నాయక్ వేరే ఫోన్ నెంబర్ తో న్యూడ్ వీడియోస్ నెట్లో పెడతానంటూ యువతిని బెదిరింపులకు గురి చేశాడు. న్యూడ్ వీడియోలు నెట్లో పెట్టకుండా ఉండాలంటే డబ్బులు ఇవ్వాలంటూ డిమాండ్ చేశాడు. వీడియో విషయంలో వేరే ఒకరితో గొడవ పడ్డానని యువతిని నమ్మించి కొంత నగదు కాజేశాడు. అలాగే యువతిని కెనడా పంపిస్తానని మరికొంత డబ్బులు కాజేశాడు దేవ నాయక్. యువతి తల్లిదండ్రులను కూడా డబ్బుల కోసం బ్లాక్ మెయిల్ చేశాడు. పలు దఫాలుగా ఫోన్ పే, గూగుల్ పే ద్వారా రూ. 2.53 కోట్లు కాజేశాడు. చివరికి మోసపోయానని గ్రహించి, నిడదవోలు పోలీసులకు ఫిర్యాదు చేసింన యువతి. యువతి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి, నిందితుడు దేవనాయక్‌ని పోలీసులు అరెస్టు చేశారు. అతని వద్దనుండి రూ. 1.81 కోట్లు స్వాధీనం చేసుకున్నారు.

# ఉపాధిహామీలో 1.55 కోట్ల మంది కార్మికుల తొలగింపు



**న్యూఢిల్లీ,**
మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ఉన్న వారిలో 2022-24 మధ్యకాలంలో 1.55 కోట్ల మంది కార్మికుల పేర్లను తొలగించినట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. కేంద్ర గ్రామీణాభివృద్ధి సహాయమంత్రి కమలేశ్ పాసవాన్ లోక్‌సభలో ఈ విషయాన్ని వెల్లడించారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో 86,17,887 మంది, 2023-24లో 68,86,532 మంది కార్మికుల పేర్లను తొలగించినట్లు కేంద్ర మంత్రి పేర్కొన్నారు. రెండేళ్లలో మొత్తంగా 1,55,04,419 మంది కార్మికుల పేర్లను తొలగించామన్నారు. నకిలీ, తప్పుడు జాబ్ కార్డులు, గ్రామాల నుంచి కార్మికుల కుటుంబాలు తరలిపోవడం లేదా సంబంధిత గ్రామాలను పట్టణాలుగా వర్గీకరించడం తదితర అంశాలు ఇందుకు కారణంగా చెప్పారు.

# చైనా దురాక్రమణలో భారత్ భూభాగాలు

## -రాహుల్ వ్యాఖ్యలపై మండిపడ్డ రాజ్‌నాథ్ సింగ్



**న్యూఢిల్లీ,**
సరిహద్దులో చైనా దురాక్రమణ అంటూ..లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్ మండిపడ్డారు. భారత్-చైనా సరిహద్దు పరిస్థితి గురించి ఆర్మీ చీఫ్ చేసిన ప్రకటనపై రాహుల్ వ్యాఖ్యలు చేయడంపై ధ్వజమెత్తారు. కాంగ్రెస్ నేత తప్పుడు ఆరోపణలు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. భారత్-చైనా సరిహద్దు పరిస్థితి గురించి ఆర్మీ చీఫ్ చేసిన ప్రకటనపై రాహుల్ గాంధీ పార్లమెంటు ప్రసంగంలో తప్పుడు ఆరోపణలు చేశారంటూ రాజ్‌నాథ్ సింగ్ మండిపడ్డారు. ఆర్మీ చీఫ్ వ్యాఖ్యలను తప్పుగా ప్రచారం చేస్తున్నారు. జాతీయ ప్రయోజనాలకు సంబంధించిన అంశాలపై ఆయన బాధ్యతారహిత రాజకీయాలకు పాల్పడడం విచారకరం. ఆయన చరిత్రపై అవగాహన పెంచుకోవాలని అంటూ 'ఎక్స్' వేదికగా విమర్శించారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంలో రాహుల్ గాంధీ.. భారత్ భూభాగాలు, మేకిన్ ఇండియా గురించి ప్రస్తావించారు. 'చైనా బలగాలు మన భూభాగంలో ఉన్నాయనే విషయాన్ని ప్రధాని మోదీ ఖండించారు. దీనిపై ఆర్మీ చీఫ్ వాస్తవం మాట్లాడారు. చైనా బలగాలు మన భూభాగంలో ఉన్నాయని ఆయన అన్నారు' అని రాహుల్ అన్నారు. అదే విధంగా తయారీ రంగంలో భారత్ కంటే చైనా పదేళ్లు ముందుందన్నారు. ఆ దేశానికి చెందిన మోటార్లు, బ్యాటరీలు, ఆప్టిక్స్‌ల దిగుమతులపై ఇప్పటికీ భారత్ ఆధారపడటాన్ని ఆయన తప్పుబట్టారు. ప్రధాని మోదీచేపట్టిన 'మేకిన్ ఇండియా' విఫలం కావడం వల్లే బీజింగ్ నుంచి వస్తువులు దేశంలోకి వస్తున్నాయని ఆయన ఆరోపించారు.

# కుంభమేళా మృతుల సంఖ్యను దాస్తున్నారు

## -లోక్‌సభలో అఖిలేశ్ యాదవ్ విమర్శలు
## -దాయాల్సిన అవసరం లేదన్న ఎంపి హేమమాలిని



**న్యూఢిల్లీ,**
అతిపెద్ద ఆధ్యాత్మిక వేడుక మహా కుంభమేళాలో ఇటీవల తొక్కిసలాట ఘటనలో మృతి చెందిన వారి సంఖ్యను ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం దాచిపెడుతోందని సమాజ్‌వాది పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ ఆరోపించారు. మంగళవారం పార్లమెంటులో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 'ప్రభుత్వం నిరంతరం బడ్జెట్ గణాంకాలు ఇస్తూనే ఉంది. అదేవిధంగా.. మహాకుంభమేళా లో మరణించిన వారి గణాంకాలు సైతం ఇవ్వాలి. అక్కడి ఏర్పాట్లపై స్పష్టత ఇవ్వడానికి అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలి. కుంభమేళా నిర్వహణ బాధ్యతలు ఆర్మీకి అప్పగించాలని డిమాండ్ చేస్తున్నానని అన్నారు. మృతుల సంఖ్య, క్షతగాత్రులకు అందించిన వైద్యం, మందులు, ఆహారం, రవాణా వంటి అన్ని వివరాలను పార్లమెంటులో సమర్పించాలి. ఘటనకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు నిజాన్ని దాచిన వారిని శిక్షించాలని డబుల్ ఇంజిన్ ప్రభుత్వాన్ని కోరుతున్నాం అన్నారు. నేరం లేకుంటే ఆ గణాంకాలను ఎందుకు దాచారని అఖిలేశ్ యాదవ్ ప్రశ్నించారు. అఖిలేశ్ యాదవ్ చేసిన ఆరోపణలపై మంగళవారం భాజపా ఎంపీ హేమమాలిని స్పందించారు. ఆ ఘటనను పెద్దదిగా చేసి చూపుతున్నారని అన్నారు. సమాజ్‌వాదీ పార్టీ ఆరోపణలను తోసిపుచ్చారు.'అసత్యాలు మాట్లాడటమే అఖిలేశ్ యాదవ్ పని. మేం కూడా కుంభమేళాను సందర్శించాం. కుంభమేళాకు ఎంతోమంది వస్తున్నారు. అంతమంది వస్తున్నప్పుడు నిర్వహణ కష్టమైనప్పటికీ.. యూపీ ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చాలా బాగా నిర్వహిస్తోందని అన్నారు.

# ప్రపంచానికి సవాల్‌గ క్యాన్సర్ మరణాలు

## వైద్యారోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్



**అమరావతి**
ప్రపంచ వ్యాప్తంగా క్యాన్సర్ వ్యాప్తి పెను సవాల్ గా మారిందని ఎపి వైద్యారోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ అన్నారు. ఇప్పటి వరకు 17.5 శాతం కాన్సర్ కారణంగా మరణిస్తున్నారని తెలిపారు. 9 శాతం మరణాలు క్యాన్సర్ వాళ్ల ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జరుగుతున్నాయి. ప్రజలకు సరైన అవగాహన లోపం, సరైనా టైంలో చికిత్స లేకపోవడంతో మరణాలు కొనసాగుతున్నాయి.. క్యాన్సర్ రోగానికి చికిత్స పోందితే నయం అవుతాయి.. కేంద్ర- రాష్ట్ర ప్రభుత్వాలు క్యాన్సర్ బాధితులను అదుకోవడానికి పెద్ద ఎత్తున చర్యలు తీసుకున్నామని మంత్రి సత్య కుమార్ యాదవ్ పేర్కొన్నారు. ఇక, ఆంధప్రదేశ్ రాష్ట్రంలో క్యాన్సర్ బాధితులను గుర్తించే పక్రియ చేస్తున్నామని మంత్రి సత్య కుమార్ అన్నారు. సినీ నటులు కాన్సర్ అవగాహన కార్యక్రమంలో పాల్గొనాలని కోరుతున్నాం.. ప్రజలు కూడా క్యాన్సర్ పరీక్షలను భయపడకుండా చేయించుకోవాలి.. అప్పుడు, ఈ క్యాన్సర్ అనే భూతాన్ని మన రాష్ట్రం నుంచి తరమి కొడతామని తెలిపారు. అలాగే, కేంద్రం ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బ్జడెట్ పై అన్ని వర్గాల నుంచి విశేష స్పందన లభించింది అని చెప్పారు. ఈ బ్జడెట్ లో ప్రధాని మోడీ పేద, మధ్య తరగతి, రైతులకు న్యాయం జరిగేలా చూశారని మంత్రి సత్య కుమార్ యాదవ్ వెల్లడించారు.

# అక్రమ వలసదారులపై ఉక్కుపాదం

## -వెతికి పట్టుకుని మరీ దేశందాటిస్తున్న ట్రంప్
## -మిలిటరీ విమానంలో పలువురు భారతీయుల తరలింపు



**వాషింగ్టన్,**
అమెరికాలో అధికారం చేపట్టిన తర్వాత, అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అక్రమ వలసదారులను దేశం నుండి బహిష్కరించడానికి కఠినమైన చర్యలు తీసుకుంటున్నారు. నిన్న మొన్నటి వరకు కెనడా, మెక్సికో, కొలంబియా, బ్రెజిల్ దేశాలకు చెందిన వారిని గెంటేసిన ట్రంప్.. తాజాగా భారత్ వంతు వచ్చేసింది. అమెరికాలో నివసిస్తున్న అక్రమ భారతీయ వలసదారులను స్వదేశానికి తిప్పి పంపిస్తున్నారు. అమెరికా మిలటరీకి చెందిన సి -17 ప్రత్యేక విమానం బయలుదేరింది. అమెరికన్ అధికారి
ఒకరు ఈ సమాచారం ఇచ్చారు. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన ఇమ్మిగ్రేషన్ ఎజెండాను నెరవేర్చడానికి సైన్యం సహాయం తీసుకుంటున్నారు. దీని కింద సైనిక విమానాల సహాయంతో ప్రజలను బహిష్కరించే పని ప్రారంభించారు. అమెరికాలో భారత్‌కు చెందిన దాదాపు 7లక్షల 25వేలకుపైగా మంది సరైన ధ్రువీకరణ పత్రాలు లేకుండా ఉంటున్నట్టు సమాచారం. వీరిలో 18 వేల మందిని భారత్‌కు తరలించేందుకు జాబితా రూపొందించింది. ఈ విషయంలో భారత్ కూడా తమ స్పందనను తెలియజేసింది. అక్రమ వలసలకు తాము కూడా వ్యతిరేకమని స్పష్టం చేసింది. వీసా గడువు ముగిసినా సరైన పత్రాలు లేకుండా అమెరికా సహా ఎక్కడ ఉన్నా భారతీయులను వెనక్కి తీసుకొస్తామని తెలిపింది. కాగా, మెక్సికో, సాల్వెడార్ తర్వాత అమెరికాలో ఎక్కువగా ఉంటున్నది భారతీయులే అని లెక్కలు చెబుతున్నాయి. అమెరికా చరిత్రలోనే అతిపెద్ద బహిష్కరణ ఆపరేషన్ కొనసాగుతోంది. దేశంలో అక్రమంగా ఉంటున్న వారిని గుర్తిస్తున్న అధికారులు వారిని ఆయా దేశాలకు తరలిస్తున్నారు. అందులో భాగంగా భారత్‌కు ఓ విమానం బయలుదేరింది. సీ17 విమానంలో వీరిని తరలిస్తున్నారు. ట్రంప్ అధ్యక్షుడయ్యాక ఇప్పటివరకు 8వేల మంది వరకు అక్రమ వలసదారులను అరెస్ట్ చేసినట్లు సమాచారం. అక్రమ వలసదారులను ఆయా దేశాలకు తరలించేందుకు రంగం సిద్ధం చేశారు. అక్రమ వలసదారులను వెనక్కి పంపేందుకు ఒక్కో వ్యక్తిపై అమెరికా దాదాపు 4వేల 675 డాలర్లు ఖర్చు చేస్తోంది. ట్రంప్ ఆదేశాల మేరకు, అమెరికా ఇమ్మిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ దేశం నుండి బహిష్కరించాల్సిన 1.5 మిలియన్ల మంది వ్యక్తుల జాబితాను సిద్ధం చేసింది. డొనాల్డ్ ట్రంప్ అధికారంలోకి వచ్చిన తర్వాత తొలిసారిగా, భారతీయ అక్రమ వలసదారులను భారతదేశానికి తిప్పి పంపించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్‌లతో జరిగిన చర్చల సందర్భంగా ట్రంప్, విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో అమెరికాలో నివసిస్తున్న అక్రమ భారతీయుల గురించి ఆందోళన వ్యక్తం చేశారు. ఏ దేశంలోనైనా చట్టవిరుద్ధంగా నివసించడాన్ని భారత్ వ్యతిరేకిస్తుందని అన్నారు. మన పౌరుల్లో ఎవరైనా అమెరికాలో చట్టవిరుద్ధంగా నివసిస్తున్నట్లయితే, వారు భారతీయ పౌరులు అయితే, స్వదేశానికి చట్టబద్ధంగా తిరిగి రావడానికి సిద్ధంగా ఉన్నామని కేంద్ర మంత్రి ఎస్ జైశంకర్ అన్నారు.

www.prajaswecha.com
ప్రజా స్వేచ్ఛ
PRAJA SWECHA

# కులగణన సర్వేపై సభలో వాడీవేడి చర్చ

(మొదటి తరువాయి)

ఇలా పాల్గొనని నేతలకు సభలో మాట్లాడే అర్హత లేదన్నారు. వారికి మైక్ ఇవ్వొద్దని స్పీకర్‌ను కోరారు. 'కులగణన సర్వే 50 రోజులు జరిగితే .. మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, ఎమ్మెల్యేలు పద్మారావు, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మహబూబ్‌నగర్ భాజపా ఎంపీ డీకే అరుణ సర్వేలో పాల్గొనలేదు. సర్వేలో భూమి వివరాలు చెప్పాలని ఫామ్‌లో ఒక కాలమ్ ఉంటే.. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు ఎవరూ సమాచారం ఇవ్వలేదు. 3.54 కోట్ల మంది సర్వేలో పాల్గొంటే.. ఎమ్మెల్యేలు, ఎంపీలు అందరూ భూముల వివరాలు ఇచ్చారు. కానీ, భూముల వివరాలు అడగ్గానే కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు భయపడి సర్వేలో పాల్గొనలేదు' అని అన్నారు. గత ప్రభుత్వం సమగ్రసర్వే నివేదికను ఎందుకు బయటపెట్టలేదోచెప్పాలన్నారు. దానిని పబ్లిక్డొమైన్‌లో ఎందుకు పెట్టలేదన్నారు. ఆనాడు అధికారికంగా అసెంబ్లో ఎందుకు పెట్టలేదని బిఆర్ఎస్‌ను నిలదీసారు. ఇదే సందర్భంలో రిజర్వేషన్లకు రాజ్యాంగ సవరణ అవసరం కనుక అసెంబ్లీలో తీర్మానం చేసినా లాభం లేదన్నారు. అందుకే పార్టీ పరంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ పక్షాన బీసీలకు 42శాతం సీట్లు ఇస్తాం అని ప్రకటించారు. అన్ని పార్టీలు దీనికి కట్టుబడి ఉంటాయా అని ప్రశ్నించారు. రాజకీయాల్లో బీసీలకు మేం 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తాం. ఈ మేరకు పీసీసీ అధ్యక్షుడి నుంచి మాట తీసుకున్నా. అన్ని పార్టీలు బీసీలకు 42శాతం సీట్లు ఇవ్వాలి. కులగణన సర్వే డేటాను సంక్షేమ పథకాల విధానాల తయారీకి వాడతాం. 1931 నుంచి ప్రతి పదేళ్లకు ఓసారి జనగణన చేపట్టారు. 2014లో నరేంద్రమోదీ ప్రధాని అయిన తర్వాత ఇప్పటివరకు జనగణన జరగలేదు. 2021 నుంచి ఇప్పటి వరకు సర్వే చేయకుండా వదిలేశారు. దీనిపై బిజెపి నేతలు ప్రధాని మోడీపై ఎందుకు ఒత్తిడి చేయడం లేదన్నారు. బలహీనవర్గాలకు వారి హక్కులు ఇవ్వడం భాజపాకు ఇష్టం లేదు. ప్రధాని మోదీ .. బలహీనవర్గాలకు ఏదైనా సాయం చేయాలనుకుంటే 2021లో లెక్కించాల్సిన జనాభాను ఇంతవరకు ఎందుకు చేయలేదని రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. సామాజిక, ఆర్థిక, ఉపాధి, విద్య, రాజకీయ, కులగణన సర్వే నివేదికను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా నివేదికలోని అంశాలను సీఎం వివరించారు. 'రాష్ట్రంలో సమగ్ర ఇంటింటి కులగణన సర్వే చేయాలని ఫిబ్రవరి 2024లో నిర్ణయం తీసుకున్నాం. కర్ణాటక, బిహార్ సహా వివిధ రాష్ట్రాల్లో జరిగిన సర్వేలను క్షుణ్ణంగా అధ్యయనం చేశాం. సర్వే నిర్వహించే విధానాలపై వివిధ సంఘాలు, మేధావుల అభిప్రాయాలు తీసుకున్నాం. దాదాపు 50 రోజుల పాటు సర్వే జరిగింది. గ్రామాల్లో 66.39 లక్షల కుటుంబాలు, పట్టణాల్లో 45.15 లక్షల కుటుంబాల్లో సర్వే నిర్వహించాం. రాష్ట్రంలో మొత్తంగా 1.12 కోట్ల కుటుంబాల వివరాలు సర్వే చేశాం. సర్వే ప్రకారం ఎస్సీలు 61,84,319 (17.43 శాతం), బీసీలు (ముస్లిం మైనారిటీ మినహా) 1,64,09,179 (46.25 శాతం), ఎస్టీలు 37,05,929 (10.45 శాతం), ముస్లిం మైనారిటీలు 44,57,012 (12.56 శాతం) మంది ఉన్నారు. ఈ నివేదికను సంక్షేమ విధానాల తయారీకి వినియోగిస్తాం. జనగణన కంటే పకడ్బందీగా కులగణన చేశాం. రాష్ట్రంలో ఉన్న ప్రతి ఇంటికీ స్టిక్కర్ అంటించాం. ఒక ఎన్యుమరేటర్ రోజుకు 10 ఇళ్లకంటే ఎక్కువ ఇళ్లలో సర్వే చేయలేదు. 8 పేజీలతో ఉన్న ప్రశ్నపత్రంలో సమగ్ర వివరాలు నమోదు చేశాం. 76 వేల మంది డేటా ఎంట్రీ ఆపరేటర్లు 36 రోజుల పాటు పనిచేసి డేటా క్రోడీకరించారు. మొత్తంగా రూ. 125 కోట్లు ఖర్చు చేసి సర్వే ద్వారా సమగ్ర వివరాలు సేకరించాం. మేం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే సర్వే చేయించాం' అని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. సర్వే ఆధారంగా ఆయా కులాల వారికి న్యాయం చేస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఈ సర్వే దేశానికే దిక్సూచిగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు. 'భవిష్యత్‌లో చేపట్టబోయే కార్యక్రమాలకు ఈ సర్వే రోడ్‌మ్యాప్‌లా పనిచేస్తుంది. భావితరాలకు న్యాయం చేయడానికి సమగ్రంగా వివరాలు సేకరించాం. బలహీనవర్గాలకు న్యాయం చేయాలనే చిత్తశుద్ధి ఈ ప్రభుత్వానికి ఉంది. బీసీలకు న్యాయం చేసేందుకు చేపట్టాల్సిన పథకాలపై విపక్షాలు సూచనలు చేయాలి' అని మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు. అంతకుముందు సమగ్ర కులగణన, ఎస్సీ వర్గీకరణ నివేదికలకు తెలంగాణ మంత్రివర్గం ఆమోదం తెలిపింది. సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన అసెంబ్లీ హాల్లో సుమారు 2 గంటలపాటు క్యాబినెట్ భేటీ కొనసాగింది. ఈ నివేదికలను మధ్యాహ్నం 2 గంటలకు అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. క్యాబినెట్ భేటీలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ 'దేశంలో మొదటిసారి కులగణన చేసి చరిత్ర సృష్టించాం. పకడ్బందీగా సర్వేచేసి సమాచారం సేకరించాం. కులగణన, ఎస్సీ వర్గీకరణకు రోడ్ మ్యాప్ తెలంగాణ నుంచి ఇస్తున్నాం. కులగణన విషయంలో ప్రధానిపైనా ఒత్తిడి పెరుగుతుంది. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పుతో పాటు మంత్రివర్గ ఉప సంఘం, ఏకసభ్య కమిషన్ సిఫార్సుల ప్రకారం ముందుకెళ్తాం. ప్రతిపక్ష నేత సభకు రావాలి కదా! ప్రధాన ప్రతిపక్షానికి బాధ్యత, చిత్తశుద్ధి లేదని వ్యాఖ్యానించారు.

## తిరుమలలో వైభవంగా రథసప్తమి

(మొదటి తరువాయి)

భక్తులను అనుగ్రహించారు. సూర్యజయంతి సందర్భంగా సూర్యప్రభ వాహనంతో మొదలై చిన్నశేష, గరుడ, హనుమ, కల్పవృక్ష, సర్వభూపాల, చంద్రప్రభ వాహనాలపై ఒకేరోజు స్వామివారు అనుగ్రహించారు. అందుకే ఈ ఉత్సవాన్ని అర్ధ బ్రహ్మోత్సవం, మినీ బ్రహ్మోత్సవం, ఒకరోజు బ్రహ్మోత్సవంగా పిలుస్తుంటారు. సూర్యోదయం నుంచి చంద్రోదయం వరకు ఏడు వాహనాలపై స్వామివారిని వేంచేపు చేస్తారు. అత్యంత ప్రధానమైన రథసప్తమి వాహనసేవ సూర్యప్రభవాహనం. సర్వలోకాలకు చైతన్యాన్ని కలిగిస్తూ ఉదయించే శ్రీ సూర్య భగవానుడు తన ఉషారేఖలను ఉదయం 6.48 గంటలకు శ్రీవారి పాదాలపై ప్రసరింపచేశాడు. ఈ వాహన సేవను తిలకించేందుకు భక్తులు పోటెత్తారు. సూర్యుడు సకలరోగ నివారకుడు, ఆరోగ్యకారకుడు, ప్రకృతికి చైతన్య ప్రదాత. ఈ వాహనంలో శ్రీవారి చుట్టూ ఉన్న సూర్యప్రభ సకల జీవుల చైతన్య ప్రభ. సూర్యప్రభ వాహనంలో ఉండే స్వామిని దర్శించుకుంటే సత్సంతాన సంపదలు, ఆయురారోగ్యాలు, భోగభాగ్యాలు సిద్ధిస్తాయి. సూర్యప్రభ వాహనం తర్వాత ఉదయం 9 నుంచి 10 గంటల వరకు చిన్న శేషవాహనంపై శ్రీవారి చిద్విలాసాన్ని చూసి తరించారు భక్తులు. చిన్న శేషుడిని నాగలోకానికి రాజుగా భావిస్తారు. వైష్ణవ సంప్రదాయం అనుసరించి భగవంతుడు శేషి..ఈ ప్రపంచం శేషభూతం అని అర్థం. చిన్నశేష వాహనంపై శ్రీవారిని దర్శించుకుంటే కుటుంబ శ్రేయస్సు ఉంటుందని భక్తుల విశ్వాసం రథ సప్తమి ఉత్సవాల్లో భాగంగా సూర్యప్రభ, చిన్న శేష వాహనం తర్వాత గరుడ వాహనంపై దర్శన మిచ్చారు మలయప్ప స్వామివారు. ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు గరుడవాహనంపై శ్రీవారిని దర్శించుకున్నారు భక్తులు. జ్ఞానవైరాగ్యానికి రూపం అయిన రెక్కలతో విహరించే గరుడుడిపై కొలువైన మలయప్పస్వామిని దర్శించుకుంటే సకలపాపాలు తొలగిపోతాయని భక్తుల విశ్వాసం రథసప్తమి ఉత్సవాల్లో భాగంగా నాలుగో వాహనసేవ హనుమంత వాహనం. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 2 గంటల వరకూ మలయప్పస్వామి హనుమంతవాహనంపై మాడవీధుల్లో విహరించారు. భక్తులలో అగ్రగణ్యుడు అయిన ఆంజనేయుడు చతుర్వేద నిష్ణాతుడుగా, నవవ్యాకరణ పండితుడుగా, లంకాభీకరుడిగా ప్రసిద్ధి. హనుమంతవాహనంపై విహరించే మలయప్పస్వామి దర్శనం సకల భయాలను రూపుమాపి, ఆయురారోగ్యాలను ప్రసాదిస్తుంది.

## కులగణనకు కేబినేట్ ఆమోదం



(మొదటి తరువాయి)

నోటీసులు జారీ అవడం హాట్ టాపిక్‌గా మారింది. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరిన 10 మంది ఎమ్మెల్యేలకు అసెంబ్లీ కార్యదర్శి నోటీసులు జారీ చేశారు. ఫిరాయింపు మీద లిఖిత పూర్వక సమాధానం ఇవ్వాలని నోటీసుల్లో పేర్కొన్నారు. తాజాగా ఈ వివాదంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించారు. ప్రొసీజర్‌లో భాగంగానే ఎమ్మెల్యేలకు నోటీసులు జారీ అయ్యాయని తెలిపారు. సమగ్ర కులగణన, ఎస్సీ వర్గీకరణ నివేదికలకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా క్యాబినెట్ భేటీలో ముఖ్యమంత్రి రేవంత్ మాట్లాడుతూ.. ఈ రోజు దేశ చరిత్రలో నిలిచిపోతుందన్నారు. ఈ నిర్ణయంతో ప్రధాని మీద ఒత్తిడి పెరుగుతుందన్నారు. అన్ని రాష్ట్రాల్లో కులగణన చేయాలనే డిమాండ్ రానుందన్నారు. భవిషత్తులో ఈ రోజు తాము ప్రవేశపెట్టే డాక్యుమెంట్ రిఫరెన్స్ తీసుకోవాలన్నారు. 2011 జనాభా లెక్కల తర్వాత మళ్లీ తామే చేశామన్నారు. 2014 లెక్కలు ఎక్కడ ఉన్నాయో చేసిన వాళ్లే చెప్పాలన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం కులగణన చేయడం లేదన్నారు. కులగణన వల్ల 76 శాతం బీసీ, ఎస్సీ, మైనార్టీలకు న్యాయం జరుగుతుందన్నారు. కులగణన చేసి చరిత్ర సృష్టించామన్నారు. పకడ్బందీగా సర్వే చేసి సమాచారం సేకరించామని చెప్పారు. ప్రధాన ప్రతిపక్షానికి బాధ్యత లేదని ముఖ్యమంత్రి సీరియస్ అయ్యారు. బీఆర్ఎస్‌ను తాము పరిగణనలోకి తీసుకోవడం లేదన్నారు. ప్రతిపక్ష నేత సభకు రావాలి కదా అని ప్రశ్నించారు. బీసీ రిజర్వేషన్ల మీదా ఆయన రియాక్ట్ అయ్యారు. కోర్టు ఆదేశాలతో బీసీ రిజర్వేషన్లపై కమిషన్ వేశామన్నారు. కోర్టు ఆదేశాల మేరకు కమిషన్ డెసిషన్ తీసుకుంటుందని పేర్కొన్నారు.

## వికసిత భారత్ తమ ధృడసంకల్పం

(మొదటి తరువాయి)

ధన్యవాద తీర్మానానికి లోక్‌సభలో ప్రధాని సమాధానమిస్తూ, మనం 2025లో ఉన్నారు. ఒకరకంగా 21వ శాతాబ్దంలో 25 శాతం ముగిసిపోయింది. 20వ శతాబ్దంలో స్వాతంత్ర్యం తరువాత, 21వ శతాబ్దంలో 25 ఏళ్లలో ఏం జరిగిందనేది కాలమే చెబుతుంది. రాష్ట్రపతి ప్రసంగాన్ని జాగ్రత్తగా గమనిస్తే, రాబోయే 25 ఏళ్లలో, వికసిత్ భారత్ దిశగా ప్రజల్లో విశ్వాసం పాదుకొలపే దిశగా పనిచేయనున్నాం. వికసిత్ భారత్ లక్ష్యాన్ని రాష్ట్రపతి ప్రసంగం ప్రతిబింబించింది. సరికొత్త ధీమాను కల్పిస్తూ, సామాన్య ప్రజానీకానికి స్ఫూర్తిగా నిలిచిందని మోదీ అన్నారు. 'గరీబీ హటోవా' నినాదంపై మాట్లాడుతూ. ప్రభుత్వం తప్పుడు హామీలు ఇవ్వదని, ప్రజలకు నిజమైన అభివృద్ధిని అందిస్తుందని ప్రధాని అన్నారు. ఇంతవరకూ పేదలుకు 4 లక్షల గృహాలు ఇచ్చామని, గతంలో మహిళలు బహిర్భూమి సిస్టమ్ లేక అవస్థలు పడవారని, ఎవరైతే అన్ని సౌకర్యాలు ఉన్నారో వారికి ఇలాంటి అవసరాలు అర్థం కావని పరోక్షంగా ప్రతిపక్ష కాంగ్రెస్‌కు చురకలు వేశారు. పేదల కోసం 12 కోట్లకు పైగా మరుగుదొడ్లు నిర్మించామని అన్నారు. గత ఐదు దశాబ్దాలుగా 2కోట్ల మంది ప్రజలను పేదరికం నుంచి బయటపడేశామని చెప్పారు. అంకితభావంతో పథకాలు అమలు చేసినప్పుడే ఇలాంటి మార్పు సంభవమని అన్నారు. పేదల గురించి ఉత్తుత్తి హామీలు తాము ఇవ్వమని, అభివృద్ధి చేసి చూపిస్తామని చెప్పారు. పేదలు, సామాన్య ప్రజలు, మధ్యతరగతి సవాళ్లను అవగాహన చేసుకుని, వాటిని అధిగమించేలా చేసేందుకు కట్టుబడి ఉంటామని చెప్పారు. 'ప్రజల సొమ్ము ప్రజల చేతికే' అనేది మా నినాదం. డిజిటల్ సాంకేతికత ద్వారా పారదర్శకత పెంచాం. పది కోట్ల నకిలీ ఖాతాలను గుర్తించి తొలగించాం. ఇథనాల్ బ్లెండింగ్ ద్వారా విదేశీ మారక ద్రవ్యాన్ని ఆదా చేశాం. గతంలో తరచూ రూ.లక్షల కోట్ల అవినీతిపై రోజూ వార్తలు వచ్చేవి. గత పదేళ్లుగా కేంద్ర ప్రభుత్వంపై అవినీతి ఆరోపణలే లేవు. మా హయాంలో మౌలిక వసతుల కల్పనపై భారీగా వెచ్చించాం. కేంద్రంలో పదేళ్లుగా అవినీతి లేకపోవడంతో జనం లాభపడ్డారు. ఆయుష్మాన్ భారత్, జన్ ఔషధి కేంద్రాల ఏర్పాటుతో రోగులకు ఎంతో మేలు జరిగిందన్నారు. మా హయాంలో ప్రతి రూపాయిని ప్రజల కోసమే ఖర్చు చేస్తున్నాం. ప్రజల డబ్బును మేం అద్దాల మేడలు నిర్మించడానికి ఉపయోగించలేదు.. దేశాభివృద్ధికి వినియోగించాం. ప్రపంచ గేమింగ్ రాజధానిగా భారత్ తయారవుతోంది. మే అధికారంలోకి రాకముందు ఎల్‌ఈడీ బల్బు ధర రూ.400 ఉండేది. మా ప్రభుత్వం రాగానే ఎల్‌ఈడీ బల్బును రూ.40కే పంపిణీ చేశాం. దీని ద్వారా దేశ ప్రజలకు రూ.20వేల కోట్లు ఆదా అయింది. మా పాలన బాగుండటం వల్లే మళ్లీ గెలుస్తున్నాం. హరియాణాలో మూడోసారి అధికారంలోకి వచ్చాం. మహారాష్ట్రలోనూ తిరిగి అధికారంలోకి వచ్చాం'అని ప్రధాని వివరించారు.

## పార్టీ మారిన ఎమ్మెల్యేకు షాక్

(మొదటి తరువాయి)

బీఆర్ఎస్ ఆశ్రయించిన విషయం తెలిసిందే. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై నాలుగు నెలల్లో చర్యలు తీసుకోవాలని గతంలోనే తెలంగాణ హైకోర్టు ఆదేశించింది. అయినప్పటికీ ఎలాంటి పురోగతి లేకపోవడంతో బీఆర్ఎస్ పార్టీ సుప్రీం కోర్టును ఆశ్రయించింది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ నుంచి గెలిచిన పది మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరిపై అనర్హత వేటు వేయాలంటూ ఇప్పటికే బీఆర్ఎస్ పార్టీ హైకోర్టులో పిటిషన్ వేసింది. ఎమ్మెల్యేలపై నాలుగు నెలల్లో చర్యలు తీసుకోవాలని హైకోర్టు ఆదేశించినప్పటికీ ఈ వ్యవహారం ముందుకు జరగలేదు. దీంతో బీఆర్ఎస్ పార్టీ సుప్రీంలో పిటిషన్ వేసింది. మొదట తెల్లం వెంకట్రావు, కడియం శ్రీహరి, దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్ పిటిషన్ వేసింది. ఆ తరువాత మరొక ఏడుగురు ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని సుప్రీంకోర్టును ఆశ్రయించింది బీఆర్ఎస్. అయితే వీటన్నింటినీ కలిపి ఒకేసారి విచారణ చేస్తామంటూ.. ఈ కేసు విచారణను సుప్రీం కోర్టు ఈనెల 10కి వాయిదా వేసింది. ఓ వైపు కోర్టులో విచారణ జరుగుతుండగానే.. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని స్పీకర్‌ను కూడా కోరింది బీఆర్ఎస్. దీనిపై స్పందించిన స్పీకర్.. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలకు నోటీసులు ఇచ్చారు. లిఖితపూర్వకంగా సమాధానాలు చెప్పాలంటూ నోటీసుల్లో పేర్కొన్నారు.

## నేడు ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు

(మొదటి తరువాయి)

పూర్తిచేసింది. ఢిల్లీలోని 70 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని మొత్తం 1.56 కోట్ల మంది ఓటర్లు బుధవారం తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఈ ఎన్నికల కోసం కేంద్ర ఎన్నికల సంఘం ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తిచేసింది. ఢిల్లీలోని 70 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని మొత్తం 1.56 కోట్ల మంది ఓటర్లు రేపు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. బుధవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరుగుతుంది. ఫిబ్రవరి 8న ఓట్లను లెక్కించి ఫలితాలను వెల్లడించనున్నారు. మొత్తం ఎన్నికల ప్రక్రియ ఫిబ్రవరి 10 తో ముగియనుంది. ఢిల్లీలోని 70 నియోజకవర్గాల్లో 58 జనరల్ సీట్లు కాగా.. మరో 12 ఎస్సీ రిజర్వ్‌డ్ సీట్లు. మొత్తం 1.56 కోట్ల మంది ఓటర్లలో 83.49 లక్షల మంది పురుష ఓటర్లు కాగా.. 71.74 లక్షల మంది మహిళా ఓటర్లు ఉన్నారు. వారిలో 20 నుంచి 29 ఏళ్ల వయస్సు గల యువ ఓటర్ల సంఖ్య 25.89 లక్షలుగా ఉంది. 18 నుంచి 19 సంవత్సరాల వయస్సు గల తొలిసారి ఓటేసే వారి సంఖ్య 2.08 లక్షలు. ఎన్నికల నేపథ్యంలో ప్రత్యేక అవసరాలు ఉన్న వారి కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు అధికారులు ప్రకటించారు. పీడబ్ల్యూడీ వర్గం నుంచి 79,430 మంది ఓటర్లు ఉన్నారు. ఇక 100 సంవత్సరాలు దాటిన ఓటర్ల సంఖ్య 830 గా ఉంది. 85 ఏళ్ల వయస్సు దాటిన ఓటర్లు 1.09 లక్షల మంది ఉన్నారు. ఢిల్లీలో ట్రాన్స్‌జెండర్ ఓటర్ల సంఖ్య 1,261 గా ఉంది. ఈ ఎన్నికల్లో మరోమారు అధికారం దక్కించుకుని హ్యాట్రిక్ కొట్టాలని ఆప్ భావిస్తోంది.

## నేడు ప్రయాగ్ రాజ్ కు ప్రధాని

(మొదటి తరువాయి)

ఆంగ్ల మీడియా కథనాలు వెల్లడించాయి. 'బుధవారం ఉదయం 10 గంటలకు ప్రధాని ప్రయాగ్‌రాజ్ ఎయిర్‌పోర్ట్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి ఉదయం 10.45 గంటలకు అరైల్ ఘాట్‌కు వెళ్తారు. ఘాట్ నుంచి బోటులో ప్రయాణించి మహాకుంభమేళా జరుగుతున్న ప్రాంతానికి చేరుకుంటారు. ఉదయం 11 నుంచి 11.30 గంటల మధ్య త్రివేణీ సంగమంలో ప్రధాని పుణ్యస్నానం ఆచరిస్తారు. 11.45 గంటలకు బోటులో తిరిగి అరైల్ ఘాట్‌కు వెళ్తారు. అక్కడి నుంచి ప్రయాగ్‌రాజ్ ఎయిర్‌పోర్టుకు వెళ్లి దిల్లీ బయల్దేరుతారు. ఈ పర్యటనలో భాగంగా ప్రధాని ఎలాంటి కార్యక్రమాల్లో పాల్గొనబోరని తెలుస్తోంది. కేవలం పుణ్యస్నానం ఆచరించి గంగానదికి పూజలు చేయనున్నారని సమాచారం. దాదాపు గంటన్నర పాటు మోదీ ప్రయాగ్‌రాజ్‌లో ఉండనున్నారు. ఈ క్రమంలోనే నగరంతో పాటు కుంభమేళా వద్ద ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేసినట్లు సమాచారం. ప్రధాని వెంట యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ పాల్గొంటారు. మహా కుంభమేళా ప్రారంభానికి ముందు ప్రధాని మోదీ ప్రయాగ్‌రాజ్ వెళ్లిన సంగతి తెలిసిందే. రూ.5500 కోట్లతో పలు అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. 144 ఏళ్లకోసారి వచ్చే జనవరి 13న కుంభమేళా ప్రారంభం కాగా.. ఫిబ్రవరి 26వ తేదీ వరకు కొనసాగనుంది. ఇప్పటికే దాదాపు 35 కోట్లకు పైగా భక్తులు కుంభమేళాకు వెళ్లి పుణ్యస్నానాలు ఆచరించారు

### తెలంగాణ సచివాలయానికి బాంబు బెదిరింపు

(మొదటి తరువాయి)

వస్తున్నాయో గుర్తించిన పోలీసులు, నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. బెదిరింపు ఫోన్ కాల్స్ ఎందుకు చేశాడనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడు మూడు రోజులుగా ఫోన్ చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. ఎస్పీఎఫ్ పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు..

## గ్రూప్ 1 రిజల్ట్స్ కు లైన్ క్లియర్

(మొదటి తరువాయి)

టీజీపీఎస్సీ కసరత్తు చేస్తుంది. జీవో 29ను సవాలు చేయడంతోపాటు వికలాంగుల రిజర్వేషన్ అంశాలపై పలువురు గ్రూప్ 1 అభ్యర్థులు సుప్రీంకోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే. దానిపై టీజీపీఎస్సీ కేవియట్ పిటిషన్ దాఖలు చేయగా.. ఇటీవల అత్యున్న ధర్మాసనం విచారణ జరిపి అభ్యర్థుల పిటిషన్లను కొట్టివేసింది. దీంతో గ్రూప్ 1 ఫలితాల విడుదలకు అన్ని అడ్డంకులు తొలగినట్లైంది. తెలంగాణ రాష్ట్రంలోని విద్యా సంస్థల్లో 2025-26 విద్యా సంవత్సరానికి గానూ ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే టీజీ ఐసెట్ 2025 నోటిఫికేషన్ మార్చి 6న విడుదల కానుంది. ఈ మేరకు ఉన్నత విద్యా మండలి వెల్లడించింది. నోటిఫికేషన్ విడుదల తర్వాత మార్చి 10 నుంచి దరఖాస్తులు స్వీకరన చేపడతారు. టీజీ ఐసెట్ సెట్ కమిటీ సమావేశాన్ని సోమవారం మాసాబ్‌ట్యాంక్‌లోని ఉన్నత విద్యామండలి కార్యాలయంలో నిర్వహించగా.. ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ఐసెట్‌కు మే 3 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇక ఐసెట్ పరీక్షలు జూన్ 8, 9 తేదీల్లో ఆన్‌లైన్‌లో జరగనున్నాయి. 2025-26 విద్యా సంవత్సరానికి ఎంఈ, ఎంటెక్, ఎం ఫార్మసీ వంటి పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే టీఎస్ పీజీఈసెట్ నోటిఫికేషన్ మార్చి 12న విడుదల చేసేందుకు విద్యాశాఖ ఏర్పాట్లు చేస్తుంది. మార్చి 17నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు ప్రారంభం అవుతాయి. సోమవారం కూకట్‌పల్లిలోని జేఎన్టీయూలో నిర్వహించిన సెట్ కమిటీ సమావేశంలో ఈ మేరకు షెడ్యూల్‌ను ఖరారు చేశారు. ఈ సందర్భంగా పీజీఈసెట్ కన్వీనర్ ప్రొఫెసర్ ఏ అరుణకుమారి, కో కన్వీనర్ ప్రొఫెసర్ బీ రవీంద్రారెడ్డి పీజీఈసెట్ షెడ్యూల్‌ను విడుదల చేశారు.

## సంపాదకీయం

# అవినీతి వ్యతిరేక పోరాటం పేరుతో వంచించిన కేజ్రీవాల్ !

అన్నాహజారే అవినీతి వ్యతిరేక ఉద్యమంలో చేరి..ఆయనకు తానే ఏకలవ్య శిష్యుడిగా ప్రచారం చేసుకుని.. రాజకీయాల్లోకి వచ్చిన ఓ ఐఆర్ఎస్ అధికారి అరవింద్ కేజ్రీవాల్..అవినీతి మరకలతో ఇప్పుడు మరోమారు తన అదృష్టాన్ని పరీక్షించుకోబోతున్నారు. అవినీతి చుట్టూ కేజ్రీవాల్ అల్లుకు పోయారు. అవినీతికి వ్యతిరేకంగా జన లోక్‌పాల్ బిల్లుకోసం అన్నాహజారే నేతృత్వంలో జరిగిన ఉద్యమమే ఆమ్ ఆద్మీ పార్టీ పుట్టుకకు దారితీసింది. ఢిల్లీ వీధుల్లో ఒకప్పుడు ఆప్ సంచలనంగా మారింది. ఆప్ టోపీలు ధరించి హమ్ ఆమ్ ఆద్మీ హూం.. అనేవారు. అవినీతిపై పోరాటాలు చేశారు. సామాజిక సమస్యలపై నృత్య రూపకాలు ప్రదర్శిస్తూ ప్రజలను ఆకట్టుకునేవారు. సామాన్య ప్రజలకోసం ఇంతగా ఆలోచించిన పార్టీ లేదని, అవినీతి అంతం ఆవాలంటే ఆప్ రావాలన్న పార్టీగా గుర్తింపు తెచ్చుకుంది. ముఖ్యమంత్రి అయిన కొత్తలో కేజీవ్రాల్ ప్రజా సమస్యలపై కేంద్రంపై పోరాడేందుకు నిరసన ప్రదర్శనలు నిర్వహించేవారు. దేశ వ్యాప్తంగా ఒకప్పుడు మాయావతి నేతృత్వంలోని బహుజన సమాజ్ పార్టీ సృష్టించిన సంచలనమే ఆప్ కూడా సృష్టించింది. కేజీవ్రాల్‌తో చేతులు కలిపేందుకు ఎందరో మేధావులు అనేక రాష్ట్రాల్లో ముందుకు వచ్చారు. వారిలో లోక్‌సత్తా జయప్రకాశ్ నారాయణ్ వంటి వారు ఉన్నారు. అలాంటి ఆప్ పూర్తిగా కనుమరుగు అయ్యే ప్రమాదం ఏర్పడింది. ఈ క్రమంలో తాజాగా ఢిల్లీ ఎన్నికల్లో గెలిస్తేనే.. కేజ్రీవాల్‌కు రాజకీయ భవితవ్యం ఉన్నట్లు. లేకుంటే ఆయనకు రాజకీయ సమాధి తప్పదు. అవినీతిపై పోరాటంలో కాంగ్రెస్‌పై యుద్ధం ప్రకటించిన కేజ్రీవాల్..అనతి కాలంలోనే దేశ ప్రజల మనసులు గెల్చుకున్నారు. ప్రజలు రాజకీయ నాయకుల అవినీతి పట్ల ఎంత అసహ్యంగా ఉన్నారనడానికి కేజ్రీవాల్ ఎదుగుదలే కారణం. కానీ అనతి కాలంలోనే కేజ్రీవాల్ నిజస్వరూపం బయటపడింది. ఆయన ముసుగు తొలగింది. అవినీతికి కేంద్రంగా కేజ్రీవాల్ రాజకీయాలు నడిచాయి. ఢిల్లీ లిక్కర్ స్కామ్ ఇందుకు పరాకాష్ట. అలాగే తన ఇంటిని వందల కోట్లతో అద్భుతంగా..అంటే బిజెపి మాటల్లో శీష్‌మహల్‌గా మార్చుకున్న తీరు ఆయన ప్రతిష్టను బాగా దిగజార్చింది. కాంగ్రెస్ అవినీతిని వ్యతిరేకించిన కేజ్రీవాల్... కాంగ్రెస్ పంచనే చేరారు. ఇప్పుడు ఢిల్లీలో మాత్రం ఆయనకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పోరాడు తోంది. ఆయన మంత్రులు అంతా అవినీతిలో పట్టుబడ్డారు. నిప్పులేనిదే పొగరాదన్నట్లు ...కేంద్రం ఎంతగా కక్షకట్టి కేసులు పెట్టినా..అవినీతి లేనిదే ఇవి నిలవవు. లిక్కర్ కేసులో బిఆర్ఎస్ అధినేత కవిత దూరిందం టేనే అవినీతి ఉందని స్పష్టం అయ్యింది. ఈ క్రమంలో కేజ్రీవాల్ ఎంతగా ఇప్పుడు అరిచి గీపెట్టినా ప్రజలు నమ్ముతారని అనుకోవడానికి లేదు. గెలుపు కోసం అవినీతి వ్యతిరేక పోరాటాన్ని పక్కన పెట్టిన కేజ్రీవాల్, ఉచిత పథకాలతో ప్రజలను మభ్య పెట్టే ప్రయత్నంలో రాజకీయాలు మొదలు పెట్టారు. అవినీతి వ్యతిరేక రాజకీయాలు పక్కన పోయాయి. కేవలం తన స్వార్ధ రాజకీయాలు మొదలు పెట్టారు. అందుకే పదేళ్లుగా ఢిల్లీ పీఠం పట్టుకుని గట్టిగా అతుక్కు పోయిన కేజ్రీవాల్‌కు ఈ ఎన్నికలు అంతు సులువు కాదు. ఆయన పక్కన ఉన్న ఎమ్మెల్యేలు అంతా పార్టీని వీడుతున్నారు. కేజ్రీవాల్నిజస్వరూప తెలిసిన వారు బయట పడుతున్నారు. అందుకే ఢిల్లీలో 2013 నుంచీ ముఖ్యమంత్రిగా ఉన్న ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజీవ్రాల్ భవిష్యత్ ఏమిటి అన్న విషయం గతంలో ఏనాడు లేని విధంగా చర్చ జరుగుతోంది. ఎందుకంటే అవినీతి అన్న వ్యవహారం నుంచి కేజ్రీవాల్ వైదొలిగారు. బిజెపిని ఢీకొంటాడన్న భ్రమలు తొలగిపోయాయి. పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ రాజకయింగా బీజేపీని ఒంటరిగా ఢీకొంటున్నారు. ఆ తరవాత అంతటి తెగువుతొ అరవింద్ కేజీవ్రాల్ రాజకీయంగా బిజెపికి ఎదురొడ్డి నిలిచాలిచారు.. 2019లో జరిగిన సార్వత్రక ఎన్నికల్లో ఢిల్లీలో బీజేపీ మొత్తం ఏడు లోక్‌సభ సీట్లు దక్కించుకున్నా, ఆరునెలల తర్వాత 2020లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీకి పూర్తి మెజారిటీ తెచ్చిపెట్టిందటే అది కేజ్రీవాల్ పట్ల ప్రజలకున్న విశ్వాసంగా చూడాలి. తన పథకాల్లో ప్రజల్లో ఆదరణ లభించడంతో తనకు తిరుగులేదని భావించి ఒక దశలో ప్రధానమంత్రి పదవి కోసం కూడా కలలు కన్న కేజీవ్రాల్, ఆ దిశగా రాజకీయాలు నడిపారు. అదే కేజ్రీవాల్ ఇప్పుడు ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ నుంచి గట్టి పోటీ ఎదుర్కొంటున్నారు. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, అధునాతనంగా నిర్మించిన ప్రభుత్వ పాఠశాలలు, మహిళలు బస్సెక్కితే ఉచితంగా ప్రయాణించేందుకు గులాబీ రంగు టికెట్, మొహల్లా వైద్యశాలలు.. వీటన్నిటితో ఢిల్లీ ప్రజలు కేజీవ్రాల్ వైపే మొగ్గు చూపారు. ఈ క్రమంలో పథకాలతో ప్రజలను బురిడీ కొట్టించవచ్చని కేజ్రీవాల్‌కు అర్థం అయిపోయింది. అందుకే అవినీతి వ్యతిరేక ఉద్యమకాడిని వదిలేశారు. తానే అవినీతికి కేంద్రంగా మారారు. తన పార్టీవారు, మంత్రులు పలువురు ఇందులో కూరుకుపోయారు. చివరకు లిక్కర్ కేసులో కేజ్రీవాల్ జైలుకు వెళ్లి వచ్చారు. ఈ క్రమంలో 2020లో వచ్చిన ఫలితాలు ఇప్పుడు పునరావృత మవుతాయని చెప్పలేని పరిస్థితి ఢిల్లీలో నెలకొంది. 2019లో మాదిరి 2024లో కూడా బీజేపీ మరోసారి మొత్తం ఏడు లోక్‌సభ సీట్లు సాధించింది. దీన్ని బట్టి ఢిల్లీ ప్రజలు జాతీయ స్థాయిలో నరేంద్రమోదీనే ప్రధాని కావాలని ఆకాంక్షిస్తున్నారని రెండోసారి రుజువైంది. కాని అసెంబ్లీ ఎన్నికల్లో మరోసారి కేజీవ్రాల్‌ను ముఖ్యమంత్రిగా ఎన్నుకుంటారని ఖచ్చితంగా చెప్పేందుకు తగిన కారణాలు కానరావడం లేదు. ఎందుకంటే అవినీతి వ్యవహారంతో కేజ్రీవాల్ ప్రతిభ మసకబారింది. ఆమ్ ఆద్మీ పార్టీ కూడా స్వయంగా తన ప్రతిష్ఠ దిగజారిపోయేలా చేసుకుంది. ఏ అవినీతి పునాదిగా ఆయన పార్టీ అవతరించిందో ఆ అవినీతే కాలనాగులా ఆయననే చుట్టుముట్టుకుంది. తనకంటూ విలాసవంతమైన భవంతిని నిర్మించుకోవడమే కాదు, ప్రభుత్వ పథకాల్లో కూడా వాటా కొట్టేయడం గురించి విజిలెన్స్ నివేదికల్లో బయటపడింది. మొహల్లా క్లినిక్‌లలో నకిలీ పేషంట్లను సృష్టించారని, జరగని వైద్య పరీక్షలను జరిగినట్లు చూపించారని, నాణ్యత లేని మందులు సరఫరా చేశారని ఈ నివేదికలు వెల్లడించాయి. ఒకప్పుడు ఎలాంటి మచ్చాలేని ఆమ్ ఆద్మీ పార్టీ అవినీతి పాఠాలు వంటబట్టించుకుంది. అణగారిన వర్గాల నుంచి అవతరించిన పార్టీలకు కూడా అవినీతి చెదలు పట్టడం రాజకీయంగా దురదృష్టం. తెలంగాణ సాధనలో కెసిఆర్ ఎంతగానో పోరాడినా అవినీతి ఇప్పుడు ఆయన పార్టీని కూడా మింగేసింది. జగన్ అవినీతి రాజకీయాలు కూడా ఎపిలో వైసిపిని ముంచాయి. అవినీతికి సంబంధించి మాట్లాడితే ప్రజలు ఛీత్కరించే పరిస్థితి వచ్చింది. దీంతో ఇప్పుడు కేజ్రీవాల్ పతనం కూడా ఆశ్చర్యానికి గురిచేయదనే చెప్పాలి.

# అమెరికా గతం... భారత్‌కు భయం!

సామాజిక జీవితంలో అన్నికంటే కష్టమైంది.. గతాన్ని పునరుద్ధరించాలని ప్రయత్నించటం! ప్రవహించే నదిలో రెండోసారి కాలుపెట్టలేమని గ్రీకు తత్వవేత్త హెరాక్లైటస్ 2500 ఏళ్ల క్రితమే చెప్పాడు. ప్రపంచం నిరంతరం మారుతూ ఉంటుంది కాబట్టి గతంలోకి వెళ్లనూలేం. దాన్ని పునరుద్ధరించనూ లేం. ఈ సత్యం సాధారణ వ్యక్తులకూ తెలుసు. అందుకే స్వతహాగా వాళ్లు ఆ ప్రయత్నాలు చేయరు. వర్తమానంలో పడుతున్న బాధలు గతంలో ఉండేవి కావనీ ధర్మం నాలుగు పాదాల మీద నడిచే యుగం ఒకప్పుడు ఉండేదన్న భావన అన్ని నాగరికతల్లో కనపడుతుంది. గతంలో ఉందో లేదో తెలియని అటువంటి యుగం.. భవిష్యత్తులో ఏర్పడాలని కోరుకోటానికీ, దానికోసం ప్రయత్నించటానికీ ఒక ఆదర్శంగా ప్రజలకది అప్పుడప్పుడూ ఉపయోగపడుతుంది. మంచికీ చెడుకూ దాన్ని వాడుకున్న సందర్భాలు చరిత్రలో కనపడతాయి. పలు గిరిజనుల పోరాటాల్లో అది ఎంతోకొంత ఉపయోగపడింది. దానికి భిన్నంగా మతోన్మాదం కోసం, జాత్యహంకారం కోసం, నియంతృత్వ స్థాపన కోసం దాన్ని వినియోగించుకున్న సంఘటనలూ ఉన్నాయి.

ఆధునిక ప్రజాస్వామ్యంలో సంప్రదాయ ధర్మయుగ పునరుద్ధరణకు ప్రయత్నించటం చాలా అరుదు. దాని జోలికి వెళ్లకపోయినా చరిత్ర పుటల్లోకి ఎక్కిన ఘనమైన గతాల పునరుద్ధరణకు ప్రయత్నాలైతే జరుగుతున్నాయి. అమెరికాను మళ్లీ గొప్పదేశంగా మారుద్దామని (మేక్ అమెరికా గ్రేట్ అగెన్) డొనాల్డ్ ట్రంప్, ఆయన అనుచరులూ చేస్తున్న హడావుడిలో ఇదే కనపడుతుంది. నిజమే! ఒకప్పుడు అమెరికాకు అన్నింటా ప్రథమ స్థానమే ఉండేది. అది క్రమేపీ పడిపోతున్నా ఇప్పటికీ అమెరికాకు ఆ స్థానం ఇంకా మిగిలే ఉంది. భౌగోళికంగా ఎన్నో అనుకూలతలు, ప్రపంచ యుద్ధాల్లో జరిగిన అతితక్కువ నష్టం, వలసదోపిడీయే లేని చరిత్ర, ఆఫ్రికా నుంచి కొనుగోలుచేసిన నల్లజాతి వారితో చేయించిన కఠిన శ్రమ, తిండి గింజలకు ఏ దేశం వైపు చూడాల్సిన అవసరం లేని పరిస్థితి, నిరంతరం కొత్త భూముల్లోకి విస్తరించగలిగే సౌలభ్యం.. ఇలా ఎన్నో ప్రత్యేకతలు అమెరికాను అగ్రస్థానంలో నిలబెట్టాయి. ప్రపంచ యుద్ధాలు... యూరపు దేశాలకూ ఆసియా, ఆఫ్రికాలకూ వినాశనాన్నీ విపరీత జననష్టాన్నీ తెస్తే అవే యుద్ధాలు అమెరికాను వస్తూత్పత్తిలో అగ్రస్థానంలో నిలిపాయి. ఆయుధ తయారీ పరిశ్రమల్లో అమెరికాకు పోటీ లేకుండా చేశాయి. ఏ



దేశానికైనా భారీ పరిశ్రమలూ అవి ఉత్పత్తిచేసే యంత్రాలూ వాటితో తయారైన వస్తువులూ పరికరాలూ ఆయువుపట్టుగా ఉంటాయి. పారిశ్రామిక విప్లవం (1760) బాగా విస్తరించిన తర్వాత ఏ దేశ శక్తినైనా వాటితోనే కొలవటం సాధారణమైంది. ఇప్పుడు దానికి అమెరికాలో కొరత ఏర్పడింది. పలు భారీ పరిశ్రమలు వేరే దేశాలకు తరలిపోయాయి. పారిశ్రామిక ఉత్పత్తుల కోసం ఇతర దేశాలపై ఆధారపడే పరిస్థితి వచ్చింది. ఎగుమతులతో పోల్చితే దిగుమతులు పెరిగాయి. 2023లో వాణిజ్యలోటు 779.8 బిలియన్ డాలర్లుగా నమోదైంది. పారిశ్రామిక ఉత్పత్తుల కోసమే కాదు సేవల రంగానికి (సర్వీస్ సెక్టర్) సంబంధించి కూడా ఇతర దేశాలపై ఆధారపడటం పెరిగింది. పొరుగుసేవలు (ఔవుట్‌సోర్సింగ్) అనివార్యమయ్యాయి. సమాచార సాంకేతికత వీటిని సులభం చేసింది. నిరుద్యోగం నిరంతరం పీడించే సమస్యగా మారింది. వలస వచ్చిన విదేశీ నిపుణులతో పోటీపడటం కష్టమైంది. 1945%-%1970 మధ్య కాలాన్ని ఆర్థికాభివృద్ధిపరంగా పాశ్చాత్య దేశాలకు స్వర్ణయుగంగా భావిస్తారు. ఉద్యోగ కల్పన గరిష్ఠస్థాయికి వెళ్లటం... సామాజిక భద్రతా పథకాల అమలు.. పారిశ్రామిక ఉత్పాదకతలో గణనీయ పెరుగుదల.. సంక్షేమ రాజ్యదృష్టితో ప్రభుత్వాలు వ్యవహరించటం.. కార్మిక సంఘాలు బలంగా ఉండటం.. అసమానతలు అదుపులో ఉండటం ఆ కాలంలో జరిగింది. ఆ తర్వాత సంక్షోభ కాలాలు మొదలయ్యాయి. 1973లో చమురు ఉత్పత్తి దేశాలు కూడబలుక్కుని ధరలు పెంచటం ప్రపంచాన్ని కుదిపివేసింది. 1970 నాటికి బ్యారల్ క్రూడ్ ఆయిల్ ధర 3.35 డాలర్లు ఉంటే 1980ల నాటికి అది 37.38 డాలర్లకు చేరుకుంది. అంతా సర్దుకున్నట్లే కొంతకాలం అనిపించటం, ఆ తర్వాత కొంతకాలానికే ఆర్థికంగా అతలాకుతలం అవ్వటం, తిరిగి మళ్లీ పుంజుకోవటం.. ఇలా ఆర్థిక వ్యవస్థ కొంతకాల వ్యవధిలో పైకీ కిందకీ అవ్వటం సాధారణమైపోయింది. ఈ సంక్షోభాలకు ప్రభుత్వాల అతి నియంత్రణే కారణమనీ సంక్షేమరాజ్యం కొత్త ఆవిష్కరణలకు అడ్డంకిగా నిలిచిందనీ సామాజిక భద్రతా పథకాలు భారంగా మారాయనీ ప్రభుత్వాల అతి వ్యయం భారంగా పరిణమించిందనీ స్వేచ్ఛా వాణిజ్యానికి ప్రభుత్వాల విధానాలు అవరోధాలయ్యాయనీ, పెట్టుబడుల స్వేచ్ఛా ప్రవాహాలకు అడ్డుగోడలు తయారయ్యాయనీ.. పలు వాదనలు బయలుదేరి సరళీకృత ఆర్థిక విధానాలే వీటికి విరుగుడనే భావన బాగా బలపడింది. మరోవైపు చైనాలోనూ రాజకీయ మార్పులు మొదలయ్యాయి. ప్రైవేటురంగానికి అక్కడ ప్రాధాన్యత పెరిగింది. 1980ల చివరినాటికి రష్యాతో సహా సోషలిస్టు ప్రభుత్వాలన్నీ కూలిపోయాయి. ప్రైవేటీకరణతో అంతా సర్దుకుని ఆర్థిక వృద్ధి పరుగులు తీస్తుందనే భావన ఎన్నాళ్లో నిలవలేదు. యుద్ధాలకూ అంతర్యుద్ధాలకూ అడ్డుకట్టపడలేదు. ఆర్థిక సంక్షోభాలూ సమసిపోలేదు. ఆగ్నేయాసియా దేశాల్లోనూ సంక్షోభం (1998) తలెత్తింది. ఇక 2007%-%08లో అమెరికాను చుట్టుముట్టిన ఆర్థిక సంక్షోభం ప్రపంచమంతా ప్రభావాన్ని చూపింది. ఆర్థిక సంక్షోభాలు తీవ్రమైనప్పుడల్లా రాజకీయాల్లో విపరీత పోకడలు కనపడతాయి. శ్వేతజాతి ఆధిపత్య భావనలతో పాటు వలస జీవులపై వ్యతిరేకతలనూ ఎగదోయటం సంక్షోభాల కాలాల్లో చాలా సులువు. ట్రంప్ చేసిందీ అదే. గడిచిన వైభవాన్ని పునరుద్ధరిస్తామని పదేపదే చెప్పటం సంక్షోభాల కాలంలో ఎక్కువగా కనపడుతుంది. రెండోసారి అమెరికా అధ్యక్షుడైన వెంటనే 'మేక్ ఇన్ అమెరికా' తన ప్రాధాన్యతగా చెప్పటంతో పాటు ఇతర దేశాల్లో ఉత్పత్తిచేసి అమెరికాలో అమ్మాలనుకుంటున్న కంపెనీలు కనీవినీ ఎరగని పన్నులకు సిద్ధం కావాలనీ హెచ్చరించారు.

# బీసీల అభ్యున్నతే కాంగ్రెస్ లక్ష్యం

ఎంత జనాభాకు అంత వాటా.. ఇదే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ మాట. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఇదే స్ఫూర్తితో పని చేస్తోంది. రాష్ట్ర ఆవిర్భావం నుంచి పదేళ్ల పాటు అధికారంలో ఉన్న కేసీఆర్ ప్రభుత్వం అన్ని వర్గాలను, ముఖ్యంగా బీసీలను అణగదొక్కింది. స్థానిక ఎన్నికల్లో 34 శాతంగా ఉన్న బీసీ రిజర్వేషన్లను 23 శాతానికి తగ్గించి వారికి తీరని అన్యాయం చేసింది. బీసీలకు వారి జనాభా ప్రకారం వాటా దక్కాల్సిందేనని నాడు కాంగ్రెస్ చేసిన పోరాటాన్ని అప్పటి సీఎం కేసీఆర్ పట్టించుకోలేదు. అయితే.. ఇప్పుడు అదే పార్టీ ఎమ్మెల్సీ, కేసీఆర్ కూతురు కవిత బీసీ రిజర్వేషన్ల కోసం రౌండ్ టేబుల్ సమావేశాలను నిర్వహించడం బీసీ సమాజం గమనిస్తోంది. అధికారంలో ఉన్న సమయంలో బీసీలకు తీరని అన్యాయం చేసిన బీఆర్ఎస్, ఇదే అంశంపై పోరాటం చేస్తామనడం అవకాశవాద రాజకీయానికి అతిపెద్ద ఉదాహరణ. బీసీలకు రిజర్వేషన్ పెంచాల్సి వస్తుందనే కుట్రతోనే బీఆర్ఎస్ ప్రభుత్వం సమగ్ర కుటుంబ సర్వేను అధికారికంగా బయటపెట్టలేదు. ఆ సర్వేలో బీసీలు 50 శాతానికి పైగా ఉన్నట్లు తేలినా.. కావాలని వారికి అన్యాయం చేసింది నాటి కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం.బీసీల అభివృద్ధికి కట్టుబడి ఉన్న కాంగ్రెస్ పార్టీ గత ఎన్నికల సమయంలో కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను ప్రకటించింది. బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతామని హామీ ఇచ్చింది. ఈ హామీ అమలుకు ఇప్పటికే బీసీ కమిషన్‌ను కాంగ్రెస్ ఏర్పాటు చేసింది. కుల గణన ఓ ఉద్యమంలా నిర్వహించింది. ఇందుకోసం ప్రత్యేకంగా కేబినెట్ సబ్ కమిటీని కూడా ఏర్పాటు చేసింది. మా ప్రభుత్వం చేపట్టిన చర్యలు బీసీ రిజర్వేషన్ల పెంపుపై పార్టీ చిత్తశుద్ధిని తెలియజేస్తున్నాయి. తెలంగాణలో 50 రోజుల పాటు నిర్వహించిన కులగణన సర్వే దేశాన్నే ఆకట్టుకుంది. 1,03,889 మంది అధికారులతో ప్రభుత్వం అత్యంత పకడ్బందీగా నిర్వహించిన కులగణన సర్వే దేశానికే రోల్ మోడల్‌లా నిలిచింది. రాష్ట్రంలో 96.9 శాతం కుటుంబాల వివరాలను అధికారులు సర్వే చేశారు. మొత్తం 3.54 కోట్ల మంది సర్వేలో పాల్గొన్నారు బీసీల




రిజర్వేషన్లను భారీగా పెంచడానికి మా ప్రభుత్వం సిద్ధంగా ఉంది. కులగణన నివేదిక, బీసీ డెడికేటెడ్ కమిషన్ సిఫారసుల ఆధారంగా 42 శాతానికి మించి రిజర్వేషన్లను ఇవ్వడమే మా ప్రభుత్వ సంకల్పం. ఇందుకు ఎలాంటి న్యాయపరమైన చిక్కులు రాకుండా అత్యంత పకడ్బందీగా ముందుకు వెళ్తున్నాం. బీసీల కోసం కాంగ్రెస్ పార్టీ, ప్రభుత్వం చేపట్టిన ఈ యజ్ఞానికి అన్ని పార్టీలు తమ సంపూర్ణ మద్దతు ప్రకటించాలి. రేపు జరిగే అసెంబ్లీ సమావేశాల్లో ప్రతీ పార్టీ, ప్రతీ సభ్యుడు బీసీ రిజర్వేషన్ల పెంపునకు ప్రభుత్వం తీసుకున్న చర్యలను బలపరచాలి. బీసీలకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్దడానికి సహకరించాలి. అయితే.. ప్రభుత్వం అత్యంత పకడ్బందీగా చేపట్టిన కుల గణనలో కొందరు ప్రధాన రాజకీయ పార్టీల పెద్దలు పాల్గొనకపోవడం బాధాకరం. ప్రధానంగా బీసీల అభ్యున్నతి కోసం చేపట్టిన ఈ కార్యక్రమంలో వారు పాలుపంచుకోకపోవడం ఆయా వర్గాలపై వారికి ఉన్న చిత్తశుద్ధిని తెలియజేస్తోంది. ముఖ్యంగా గత పదేళ్ల పాటు అధికారంలో ఉండి.. నేడు బీసీల గురించి మాట్లాడుతున్న కల్వకుంట్ల ఫ్యామిలీలో కవిత తప్ప, ఎవరూ వివరాలు ఇవ్వలేదు. దీనిపై వారు సమాధానం చెప్పాలి. కొందరు కావాలని వివరాలు ఇవ్వలేదు. ఇప్పటికైనా బీసీల కోసం అన్ని పార్టీలు ముందుకు రావాలి. కుల గణనపై అన్ని రాజకీయ పార్టీలు తమ విధానం ఏమిటో సమాజానికి స్పష్టం చేయాలి. బలహీన వర్గాల కోసం రేపు అసెంబ్లీలో అన్ని పార్టీలు తమ వాదన వినిపించాలి. రేపటి కేబినెట్ సమావేశంలో భవిష్యత్ కార్యాచరణపై నిర్ణయం తీసుకుంటాం కుల గణన చేస్తామని మాట ఇచ్చాం, నిలబెట్టుకున్నాం. బీసీ సోదరులంతా ఉత్సవాలు జరుపుకోవాల్సిన సమయం ఆసన్నమైంది. కేసీఆర్ నేడు అసెంబ్లీకి రావాలి. కులగణన రిపోర్టు, బీసీ రిజర్వేషన్ల పెంపు విషయంలో బీఆర్ఎస్ పార్టీ విధానం ఏమిటో చెప్పాలి. అంతే కానీ ఆయన అసెంబ్లీకి రాకుండా ఎవరితోనో మాట్లాడిస్తే బీసీలకు అన్యాయం చేసిన వ్యక్తిలా చరిత్రలో మిగిలిపోతారు.

బీసీలకు న్యాయం జరగాలని కోరుకుంటే కేసీఆర్ అసెంబ్లీకి వస్తారు. ప్రభుత్వం తరఫున బీసీలకు ఒక విషయాన్ని స్పష్టంగా చెబుతున్నా. గత ప్రభుత్వాల మాదిరిగా కమిటీ రిపోర్టును బీరువాలో, ఫ్రిజ్‌లో పెట్టం. ఆ రిపోర్ట్‌ను అమలు చేస్తాం.. దేశంలో ఆదర్శంగా నిలుస్తాం. ఎవరెన్ని కుట్రలు చేసినా.. ఎంతలా అడ్డుపడ్డా.. బీసీలకు అవకాశాలు.. ఆత్మగౌరవం పెంచడమే.. మా కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం. గత ప్రభుత్వ హయంలో అరకొరగా ఉన్న డైట్ ఛార్జీలతో విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. ఇది గుర్తించిన మా ప్రభుత్వం భారీగా మెస్ ఛార్జీలను పెంచింది. 3 నుంచి 7వ తరగతి వరకు హాస్టల్ విద్యార్థులకు గతంలో రూ.950గా ఉన్న డైట్ ఛార్జీలను రూ.1,330కి పెంచాం. 8 నుంచి 10వ తరగతి వరకు హాస్టల్ విద్యార్థులకు రూ. 1100నుంచి రూ.1,540కి పెంచాం. ఇంటర్ నుంచి పీజీ వరకు హాస్టల్ విద్యార్థులకు రూ.1,500 నుంచి రూ.2,100కి పెంచాం. 3 నుంచి 7వ తరగతి వరకు ఒక్కో విద్యార్థికి రూ.55గా ఉన్న కాస్మోటిక్ ఛార్జీలను రూ.175కు పెంచాం. అలాగే 8 నుంచి 10వ తరగతి వరకు రూ.75నుంచి రూ.275కి పెంచాం. ఈ నిర్ణయంతో ప్రభుత్వ హాస్టళ్లలో విద్యను అభ్యసిస్తున్న 7.5 లక్షల మందికి పైగా విద్యార్థులకు లబ్ధి చేకూరింది. పేద, వెనుకబడిన వర్గాల వారిపై మా ప్రభుత్వ కమిట్‌మెంట్‌కు ఇది నిదర్శనం. రాష్ట్రంలో తొలిదశ కింద 28 యంగ్ ఇండియా సమీకృత గురుకులాలు మంజూరు చేశాం.

# పోటీపడి విజేతగా నిలిచారు






మహిళా కబడ్డీ విజేత రాచకొండ కమిషనరేట్ జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న ఐజి రమేష్ రెడ్డి

## -నేడు రాష్ట్రస్థాయి పోలీసు క్రీడల ముగింపు

హైదరాబాద్ ప్రజా స్వేచ్ఛ
కరీంనగర్ కమిషనరేట్ పరిధిలో నాలుగు రోజులుగా జరుగుతున్న రాష్ట్రస్థాయి పోలీస్ క్రీడను శనివారం ముగియనున్నాయి శుక్రవారం వరకు ఆయా విభాగాల్లో విజేతల వివరాలు ఇలా ఉన్నాయి ప్రధమ, ద్వితీయ స్థానాల జట్లు వరుసగా కబడ్డీ మహిళా విభాగంలో రాచకొండ కమిషనరేట్ యాదాద్రి జోన్ పురుషుల విభాగంలో హైదరాబాద్ కమిషనరేట్ రాచకొండ కమిషనరేట్ వాలీబాల్ లో హైదరాబాద్ కమిషనరేట్ యాదాద్రి జోన్ బాల్ లో టీజీఎస్పీ-1 హైదరాబాద్ కమిషన, బాస్కెట్బాల్ లో హైదరాబాద్ కమిషనరేట్ కాలేశ్వరం జోన్, కోకోలో టీజీఎస్పీ-1 టీవీఎస్పి-2 రాజన్న జోన్-3(తృతీయ స్థానం) కోకోలో ప్రతిభ చూపిన రాజన్న జోన్ కు చెందిన వెంకటేష్ను ఐజి రమేష్ రెడ్డి అభినందించారు ఐజి చంద్రశేఖర్ రెడ్డి కరీంనగర్ సిపి అభిషేక్ మహంతి, కరీంనగర్ రూరల్ ఏపీ శుభం ప్రకాష్ తదితరులు పర్యవేక్షించారు





www.prajaswecha.com
ప్రజా స్వేచ్ఛ
PRAJA SWECHA

# తెలంగాణ జిల్లా కోర్టులకు జడ్జిల నియామకం




**హైదరాబాద్ ప్రజా స్వేచ్ఛ**

తెలంగాణలో జిల్లా కోర్టులకు జడ్జిలను హైకోర్టు నియమించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలోని 30 జిల్లాలకు జిల్లా జడ్జీలను నియమిస్తూ హైకోర్టు నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరగా పరిష్కరించేలా పలు జిల్లాలకు జడ్జిలను హైకోర్టు నియమించింది. ఈ మేరకు వారికి కీలక ఆదేశాలు జారీ చేసింది.

నియమించిన న్యాయమూర్తులు వీరే..

-ఎల్ జస్టిస్ సుజోయ్ పాల్ హైదరాబాద్
-జస్టిస్ పి. సామ్ కోశి రంగారెడ్డి
-జస్టిస్ అభినంద్ కుమార్ షావిలి మేడ్చల్-మల్కాజిగిరి
-జస్టిస్ మౌషుమి భట్టాచార్య హనుమకొండ, వరంగల్
-జస్టిస్ టి.వినోద్ కుమార్ నల్గొండ
-జస్టిస్ కె. లక్ష్మణ్ కరీంనగర్
-జస్టిస్ బి. విజయసేన్ రెడ్డి ఖమ్మం
-జస్టిస్ పి. శ్రీ సుధ సంగారెడ్డి
-జస్టిస్ జి. రాధారాణి సూర్యాపేట
-జస్టిస్ ఎన్. తుకారాం నిజామాబాద్
-జస్టిస్ టి.మాధవి దేవి సిద్దిపేట
-జస్టిస్ కె. సురేందర్ భోనగిరి
-జస్టిస్ సూరేపల్లి నంద కొత్తగూడెం
-జస్టిస్ జువ్వాడి శ్రీదేవి మహబూబ్‌నగర్
-జస్టిస్ ఎన్.వి. శ్రవణ్ కుమార్ మంచిర్యాల
-జస్టిస్ ఎం.జి. ప్రియదర్శిని పెద్దపల్లి
-జస్టిస్ సి.వి. భాస్కర్ రెడ్డి వికారాబాద్
-జస్టిస్ ఇ.వి. వేణుగోపాల్ జగిత్యాల
-జస్టిస్ నగేష్ భీమపాక మహబూబాబాద్ ములుగు
-జస్టిస్ పుల్లా కార్తీక్ కామారెడ్డి
-జస్టిస్ కె. శరత్ నాగర్ కర్నూల్
-జస్టిస్ జె. శ్రీనివాసరావు మెదక్
-జస్టిస్ నామవరపు రాజేశ్వర్ రావు సిరిసిల్ల
-జస్టిస్ లక్ష్మీ నారాయణ అలిశెట్టి నిర్మల్ %d% ఆసిఫాబాద్
-జస్టిస్ జె. అనిల్ కుమార్ జనగాం
-జస్టిస్ కె. సుజనా వనపర్తి
-జస్టిస్ వై. రేణుక ఆదిలాబాద్
-జస్టిస్ ఎన్. నర్సింగ్ రావు గద్వాల్
-జస్టిస్ ఇ. తిరుమల దేవి భూపాలపల్లి
-జస్టిస్ బి.ఆర్. మధుసూధన్ రావు నారాయణపేట..



తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్డ్ జడ్జి, కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

# కుంభమేళా మృతుల సంఖ్యను దాస్తున్నారు

**-లోక్‌సభలో అఖిలేశ్ యాదవ్ విమర్శలు**
**-దాయాల్సిన అవసరం లేదనన్న ఎంపి హేమమాలిని**

**న్యూఢిల్లీ, ప్రజా స్వేచ్ఛ**

అతిపెద్ద ఆధ్యాత్మిక వేడుక మహా కుంభమేళాలో ఇటీవల తొక్కిసలాట ఘటనలో మృతి చెందిన వారి సంఖ్యను ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం దాచిపెడుతోందని సమాజ్‌వాది పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ ఆరోపించారు. మంగళవారం పార్లమెంటులో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 'ప్రభుత్వం నిరంతరం బడ్జెట్ గణాంకాలు ఇస్తూనే ఉంది. అదేవిధంగా.. మహాకుంభమేళా లో మరణించిన వారి గణాంకాలు సైతం ఇవ్వాలి. అక్కడి ఏర్పాట్లపై స్పష్టత ఇవ్వడానికి అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలి. కుంభమేళా నిర్వహణ బాధ్యతలు ఆర్మీకి అప్పగించాలని డిమాండ్ చేస్తున్నానని అన్నారు. మృతుల సంఖ్య, క్షతగాత్రులకు అందించిన వైద్యం, మందులు, ఆహారం, రవాణా వంటి అన్ని వివరాలను పార్లమెంటులో సమర్పించాలి. ఘటనకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు నిజాన్ని దాచిన వారిని శిక్షించాలని డబుల్ ఇంజిన్ ప్రభుత్వాన్ని కోరుతున్నాం అన్నారు. నేరం లేకుంటే ఆ గణాంకాలను ఎందుకు దాచారని అఖిలేశ్ యాదవ్ ప్రశ్నించారు. అఖిలేశ్ యాదవ్ చేసిన ఆరోపణలపై మంగళవారం భాజపా ఎంపీ హేమమాలిని స్పందించారు. ఆ ఘటనను పెద్దదిగా చేసి చూపుతున్నారని అన్నారు. సమాజ్‌వాదీ పార్టీ ఆరోపణలను తోసిపుచ్చారు. 'అసత్యాలు మాట్లాడటమే అఖిలేశ్ యాదవ్ పని. మేం కూడా కుంభమేళాను సందర్శించాం. కుంభమేళాకు ఎంతోమంది వస్తున్నారు. అంతమంది వస్తున్నప్పుడు నిర్వహణ కష్టమైనప్పటికీ.. యూపీ ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చాలా బాగా నిర్వహిస్తోందని అన్నారు.

# ప్రపంచానికి సవాల్‌గ క్యాన్సర్ మరణాలు

**వైద్యారోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్**



**అమరావతి** ప్రజా స్వేచ్ఛ ప్రపంచ వ్యాప్తంగా క్యాన్సర్ వ్యాప్తి పెను సవాల్ గా మారిందని ఏపి వైద్యారోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ అన్నారు. ఇప్పటి వరకు 17.5 శాతం కాన్సర్ కారణంగా మరణిస్తున్నారని తెలిపారు. 9 శాతం మరణాలు క్యాన్సర్ వాళ్ల ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జరుగుతున్నాయి. ప్రజలకు సరైన అవగాహన లోపం, సరైనా టైంలో చికిత్స లేకపోవడంతో మరణాలు కొనసాగుతున్నాయి.. క్యాన్సర్ రోగానికి చికిత్స పోందితే నయం అవుతాయి.. కేంద్ర- రాష్ట్ర ప్రభుత్వాలు క్యాన్సర్ బాధితులను అదుకోవడానికి పెద్ద ఎత్తున చర్యలు తీసుకున్నామని మంత్రి సత్య కుమార్ యాదవ్ పేర్కొన్నారు. ఇక, ఆంధప్రదేశ్ రాష్ట్రంలో క్యాన్సర్ బాధితులను గుర్తించే పక్రియ చేస్తున్నామని మంత్రి సత్య కుమార్ అన్నారు. సినీ నటులు కాన్సర్ అవగాహన కార్యక్రమంలో పాల్గొనాలని కోరుతున్నాం.. ప్రజలు కూడా క్యాన్సర్ పరీక్షలను భయపడకుండా చేయించుకోవాలి.. అప్పుడు, ఈ క్యాన్సర్ అనే భూతాన్ని మన రాష్ట్రం నుంచి తరమి కొడతామని తెలిపారు. అలాగే, కేంద్రం ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బ్జడెట్ పై అన్ని వర్గాల నుంచి విశేష స్పందన లభించింది అని చెప్పారు. ఈ బ్జడెట్ లో ప్రధాని మోడీ పేద, మధ్య తరగతి, రైతులకు న్యాయం జరిగేలా చూశారని మంత్రి సత్య కుమార్ యాదవ్ వెల్లడించారు.

# కుంభం ఫౌండేషన్ ద్వారా వృద్ధులను కంటి ఆపరేషన్‌కు తరలింపు

**-బస్సుల్లో వృద్ధులను తరలిస్తున్న కాంగ్రెస్ శ్రేణులు**



**ప్రజా స్వేచ్ఛ జనవరి 04 వలిగొండ ప్రతినిధి**

కుంభం పౌండేషన్ చైర్మన్ కుంభం కీర్తిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన మేగా ఉచిత కంటి వైద్య శిబిరంలో ఆపరేషన్‌లకు అర్హులైన వృద్ధులను జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో,శంకర కంటి ఆసుపత్రి సహకారంతో ఆదివారం మెగా ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించిన విషయం తెలిసిందే. శిబిరంలో 900 మందికి పరీక్షలు చేయగా అందులో 250 మందిని కంటి ఆపరేషన్లకు ఎంపిక చేశారు ఆపరేషన్ కు ఎంపికైన వారిని అదే రోజు మొదటి విడతగా 130 మందిని పంపించారు మంగళవారం రెండవ విడతగా 120 మంది వృద్ధులను కంటి ఆపరేషన్ల కోసం ఆసుపత్రికి చెందిన వాహనాల్లో శంకర కంటి ఆసుపత్రి హైదరాబాద్ కు తరలింపు చర్యలు చేపట్టారు.ఆపరేషన్ అనంతరం వీరందరని మళ్లీ బస్సుల్లో తరలిస్తామని తెలిపారు.తరలించిన వారిలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు కంకల కిష్టయ్య యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మైసొల్ల ప్రవీణ్ కొండూరు సాయి బత్తిని వరుణ్ కాంగ్రెస్ శ్రేణులు వ్యవహరించారు

# తైక్వోండ క్రీడలో గ్రీన్ ఫీల్డ్స్ విద్యార్థుల అద్భుతాలు




**ప్రజా స్వేచ్ఛ ఫిబ్రవరి 4 ఘట్కేసర్ ప్రతినిధి**

క్రీడల ద్వారా విద్యార్థుల్లో మానసిక స్థైర్యాన్ని, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని అన్నారు గ్రీన్ ఫీల్డ్స్ పాఠశాల కరస్పాండెంట్ పిఎల్ఎన్ రెడ్డి, ప్రిన్సిపాల్ విజయ రెడ్డి. ఈ మేరకు గత నెల 25, 26వ తేదీలో బెంగళూరులో జరిగిన తైక్వోండ 7వ వీఫా ఛాంపియన్షిప్ పోటీల్లో గ్రీన్ ఫీల్డ్స్ విద్యార్థులు పాల్గొని ఒక బంగారు, మూడు సిల్వర్ పథకాలు సాధించడం సంతోషాన్ని ఇచ్చిందని తెలియజేశారు. బంగారు మెడల్ తో పాటు సిల్వర్ మెడల్ సాధించిన విష్ణువర్ధన్ ని, రెండు సిల్వర్ పథకాలు సాధించిన వివేక్ మీన విద్యార్థులను అభినందించి ప్రోత్సహించారు. అనంతరం పాఠశాల యాజమాన్యం మాట్లాడుతూ తైక్వోండ కోచ్ బి శివారెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు క్రీడల్లో శిక్షణ తీసుకుంటున్నారని... కోచ్ బి శివారెడ్డి కృషికి, విద్యార్థిల శ్రమకి ఫలితం దక్కిందని అన్నారు. చదువుతోపాటు క్రీడల్లో పాల్గొనడానికి ఎక్కువ అవకాశం ఇస్తున్నామని, క్రీడలతో నూతన ఆవిష్కరణల కోసం విద్యార్థులను ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తామని అన్నారు.

# శ్రీ భక్త మార్కండేయ కళ్యాణోత్సవంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య



**ప్రజా స్వేచ్ఛ ఫిబ్రవరి 04 రామన్నపేట ప్రతినిధి**




రామన్నపేట మండలం సిరిపురం గ్రామంలో శ్రీ భక్త మార్కండేయ స్వామి కళ్యాణోత్సవం ప్రధమ వార్షికోత్సవంలో మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య పాల్గొని పూజలు చేసి గ్రామ ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని పద్మశాలి ఆరాధ్య దైవమైన శ్రీ భక్త మార్కండేయ స్వామి ఆశీస్సులు అందరికీ ఉండాలని తెలియజేయడం జరిగింది అనంతరం పద్మశాలి సంఘం వారు పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతూ శాలువతో సత్కరించి స్వాగతం పలకడం జరిగింది ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి పోషబోయిన మల్లేశం మాజీ ఎంపీపీ నీల దయాకర్ మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ లు బందెల రాములు కంభంపాటి శ్రీనివాస్ మాజీ ఎంపీటీసీలు వేమవరం సుధీర్ బాబు పున్న వెంకటేశం జిల్లా నాయకులు ఎస్కే చాంద్ గ్రామ శాఖ అధ్యక్షుడు బంద శ్రీనివాసరెడ్డి పట్టణ కార్యదర్శి జాడ సంతోష్ నాయకులు మిరియాల మల్లేశం అప్పం శ్రీరాములు కడారి శివ నల్ల సైదులు కూనూరు మహేష్ శ్రవణ్ చిరు మధు గ్రామస్తులు తదితరులు పాల్గొనడం జరిగింది

# బిజినెస్

## వాట్సాప్ లో అదిరిపోయే కొత్త ఫీచర్లు.

### యూజర్లు వెంటనే యాక్సెస్ చేసుకోవాల్సిందే..!




ఏఐ స్టూడియో అనే కొత్త ఫీచర్ ను వాట్సాప్ ప్రారంభించింది. యూజర్లు దీని ద్వారా వివిధ ఏఐ పర్సనాలిటీలతో సంభాషించే వీలుంటుంది. ఇవి ఇంటరాక్షన్ ఫన్ ను యాడ్ చేస్తాయి. ఫేమస్ పర్సనాలిటీస్ నుంచి వివిధ వ్యక్తుల రోల్స్ ను ఈ పర్సనాలిటీలు కలిగి ఉంటాయి. మోటా ఏఐ చాట్ విండో ద్వారా మీరు ఈ ఫీచర్ ను యాక్సెస్ చేసుకోవచ్చు.ఐఓఎస్ యూజర్ల కోసం వాట్సాప్ లో బిల్ట్ ఇన్ డయల్ ప్యాడ్ ఫీచర్ అందుబాటులోకి వచ్చింది. కాల్స్ ట్యాబ్ లోని ప్లస్ (o) ఐకాన్ ను ట్యాప్ చేయడం ద్వారా, వినియోగదారులు మొదట కాంటాక్ట్ లను సేవ్ చేయకుండానే నేరుగా ఫోన్ నంబర్లను డయల్ చేయవచ్చు.యూజర్లు మెసేజ్ లను డబుల్ ట్యాప్ చేసి ఎమోజీలతో వేగంగా స్పందించవచ్చు. ఇన్ స్టాగ్రామ్ డీమ్ లో కనిపించే ఫీచర్ మాదిరిగానే ఇది ఉంటుంది. వినియోగదారులు రెస్పాన్స్ మోనూ ను తెరవడానికి సందేశాన్ని ట్యాప్ చేయవచ్చు. మీకు ఇష్టమైన ఎమోజీని ఎంచుకోవచ్చు.కస్టమ్ ఫీచర్ ద్వారా గ్యాలరీలోని ఫొటోల నుంచి కస్టమ్ స్టిక్కర్లను రూపొందించడానికి ఈ ఫీచర్ ఎంతో ఉపయోగపడుతుంది. ఆటోమేటిక్ గా మీ ఇమేజ్ నుంచి సబ్జెక్ట్ ను కట్ చేసి స్టిక్కర్ గా మారుస్తుంది. స్టిక్కర్ స్పేస్ నుంచి నేరుగా లింక్ పంపడం ద్వారా మీరు స్టిక్కర్ ప్యాక్ లను ఇతరులతో పంచుకోవచ్చువీడియో స్టేటస్ లకు బ్యాక్ గ్రౌండ్ ఎఫెక్టులు చేసుకునే అవకాశం ఇప్పటికే యూజర్లకు ఉంది. ఇప్పుడు దీన్ని ఫొటోలకు అందుబాటులోకి తీసుకువచ్చారు. ఫొటోలను పంపించే ముందు వివిధ ఎఫెక్టులు, ఫిల్టర్లను ఎంపిక చేసుకోవచ్చు.ఆండ్రాయిడ్ వినియోగదారులకు టెక్స్ట్, మీడియా లేదా లింక్ లను ఫార్వార్డ్ చేసేటప్పుడు పర్సనలైజ్ సందేశాలను జోడించడాన్ని వాట్సాప్ సులభతరం చేసింది. ఈ ఆప్షన్ ఇప్పుడు ఆండ్రాయిడ్ యూజర్లందరికీ అందుబాటులోకి వచ్చింది.


## బంగారం ధరలకు రెక్కలు

### ట్రంపం నిర్ణయాలతో అంతర్జాతీయ ప్రభావం



న్యూఢిల్లీ,
మెరికా అధ్యక్షుడు ట్రంప్ తీసుకుంటున్న నిర్ణయాలు, బంగారం ధరలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. కెనడా, మెక్సికో, చైనా ఉత్పత్తులపై టారిఫ్‌లు ప్రకటించిన ట్రంప్ .. తదుపరి మెక్సికోకు మాత్రం విరామం కల్పించారు. అమెరికా వస్తువులపై పన్ను విధిస్తామని కెనడా ప్రకటించగా, చైనా కూడా ప్రతిస్పందించనున్న నేపథ్యంలో సోమవారం అమెరికా సహా ప్రపంచవ్యాప్త స్టాక్‌మార్కెట్లు నష్టపోయాయి. అనిశ్చితి పరిస్థితుల్లో ఆర్థికంగా భరోసా ఇచ్చే పసిడిపైకి పెట్టుబడులు మళ్లడంతో అంతర్జాతీయ విపణిలో పుత్తడి ధర కొండెక్కింది. డాలర్ విలువ రూ.87.11కు చేరినందున, దేశీయంగా బంగారం ధర పెరుగుదల మరింత అధికంగా కనపడుతోంది. హైదరాబాద్ బులియన్ విపణిలో 10 గ్రాముల మేలిమి (24 క్యారెట్లు/999 స్వచ్ఛత) బంగారం ధర తొలిసారిగా సోమవారం రూ.86,000ను తాకింది. అంతర్జాతీయంగా ఔన్సు (31.10 గ్రాముల) ధర 2,829.57 డాలర్లకు చేరడం ఇందుకు నేపథ్యం. అయితే తదుపరి కొంత లాభాల స్వీకరణతో రాత్రి 11.30 గంటల సమయానికి ఔన్సు బంగారం ధర 2820 డాలర్లకు దిగి రావడంతో, హైదరాబాద్ బులియన్ విపణిలోనూ రూ.85,880 వద్ద ట్రేడ్ అవుతోంది. ఇది కూడా ఇప్పటివరకు బంగారానికి గరిష్ఠస్థాయే. జనవరి 30న తొలిసారిగా 10 గ్రా.మేలిమి బంగారం ధర రూ.84,000కు, మరుసటిరోజు రూ.85,000ను తాకగా, సోమవారం రూ.86,000కు చేరడంతో కొనుగోలుదార్లు బెంబేలెత్తుతున్నారు. కిలో వెండి ధర రూ.96,400 వద్ద ఉంది.

## భారీ లాభాలతో ముగిసిన స్టాక్ మార్కెట్లు.. చాలా రోజుల తర్వాత..



ఇండియన్ స్టాక్ మార్కెట్లు భారీ లాభాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఓ దశలో 1450 పాయింట్ల మేర లాభపడగా.. నిఫ్టీ 23,750 మార్కును అందుకుంది. సెన్సెక్స్ ఇంట్రాడేలో దాదాపు 1450 పాయింట్లు లాభపడి 78,658.59 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరికి 1397.07 పాయింట్ల లాభంతో 78,583.81 పాయింట్ల వద్ద ముగిసింది. నిఫ్టీ 378.20 పాయింట్ల లాభంతో 23,739.25 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 87.07గా కొనసాగుతోంది. మదుపర్ల సంపదగా భావించే బీఎస్‌ఈలో నమోదిత కంపెనీల మొత్తం విలువ రూ.5.5 లక్షల కోట్లు పెరిగి రూ.425 లక్షల కోట్లకు చేరింది.అమెరికా ప్రెసిడెంట్ ట్రంప్ టారిఫ్ వార్ కు కాస్త బ్రేక్ ఇవ్వడంతో మార్కెట్లో ఫుల్ జోష్ వచ్చింది. కెనడా, మెక్సికో దేశాలపై 25 శాతం, చైనాపై 10 శాతం సుంకాలను విధిస్తున్నట్లు ఇటీవల ట్రంప్ ప్రకటించడంతో ట్రేడ్ వార్ మొదలైందనే భయాలతో ప్రపంచ మార్కెట్లు కుప్పకూలాయి. ఆసియా మార్కెట్లతో పాటు ఇండియన్ మార్కెట్లు కూడా దారుణంగా పడిపోయాయి. అయితే తాజాగా ట్రేడ్ వార్ ను 30 రోజుల పాటు వాయిదా వేస్తున్నట్లు ప్రకటించడంతో ప్రపంచ వాణిజ్యంలో తాత్కాలిక ఉపశమనం కలిగినట్లైంది. దీంతో మార్కెట్లు లాభాల బాటపట్టాయి.

## ఇంగ్లాండ్‌తో తొలి వన్డే నుంచి జడ్డు అవుట్?!



ఫిబ్రవరి 6 నుంచి నాగ్‌పూర్‌లో ఇంగ్లాండ్‌తో జరిగే మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌ను భారత్ ప్రారంభించనుంది. తొలి వన్డేకు టీమిండియా ప్లేయింగ్ 11 గురించి కీలక చర్చలు జరుగుతున్నాయి. ఇదిలా ఉండగా, భారత మాజీ ఆటగాడు, క్రికెట్ నిపుణుడు ఆకాష్ చోప్రా తొలి వన్డేకు టీం ఇండియా స్పిన్నర్లకు అవకాశం ఉందని తెలిపాడు. ఇంగ్లాండ్‌తో జరిగే సిరీస్‌లోని మొదటి మ్యాచ్‌లో ఆల్ రౌండర్ రవీంద్ర జడేజాకు స్థానం లభించకపోవచ్చని చోప్రా అభిప్రాయపడ్డాడు. ఇంగ్లాండ్‌తో జరిగే వన్డే సిరీస్, తదుపరి ఛాంపియన్స్ ట్రోఫీ కోసం భారతదేశం అనేక స్పిన్ ఎంపికలను ఎంచుకుంది. రవీంద్ర జడేజాతో పాటు అక్షర్ పటేల్, కుల్దీప్ యాదవ్, వాషింగ్టన్ సుందర్ కూడా జట్టులో ఉన్నారు. ఇటువంటి పరిస్థితిలో, ఏ ఆటగాళ్ళకు స్పిన్నర్‌గా స్థానం లభిస్తుందో ఊహించడం కొంచెం కష్టం. తన యూట్యూబ్ ఛానెల్‌లో షేర్ చేసిన వీడియోలో, ఆకాష్ చోప్రా మాట్లాడుతూ.. “ఈ జట్టు ప్రస్తుతం బ్యాటింగ్‌లో అంత నమ్మకంగా లేదు. కాబట్టి, 8వ స్థానంలో 100 శాతం బ్యాట్స్‌మన్‌ను కనుగొంటారని నేను అనుకుంటున్నాను. ఒక బౌలర్ రాజీ పడాల్సి ఉంటుంది. ముగ్గురు ఫింగర్-స్పిన్ ఆల్ రౌండర్లలో, ఇద్దరు మిగిలి ఉన్నారు. ఇందులో అక్షర్ ముందుగా వస్తాడని నేను అనుకుంటున్నాను. వాషింగ్టన్ సుందర్ రెండవ స్థానంలో ఉంటాడు. అలాగే, కుల్దీప్ యాదవ్ రూపంలో మణికట్టు స్పిన్నర్, ఆపై ఇద్దరు ఫాస్ట్ బౌలర్లు ఉంటారు. అయితే, జడ్డుకు బహుశా చోటు ఉండకపోవచ్చు అని నేను అనుకుంటున్నాను” అంటూ తెలిపాడు. గత కొంతకాలంగా రవీంద్ర జడేజా వన్డేల్లో అంత బాగా రాణించడం లేదని, ముఖ్యంగా బ్యాటింగ్‌లో అతను నిరాశపరిచిన సంగతి తెలిసిందే. జడేజా తన చివరి వన్డేను 2023 ప్రపంచ కప్‌లో ఆడాడు. తదనంతరం, గత సంవత్సరం శ్రీలంకలో జరిగిన వన్డే సిరీస్ నుంచి అతనికి విశ్రాంతి ఇచ్చారు. అక్షర్ పటేల్‌కు ప్రాధాన్యత ఇచ్చిన సంగతి తెలిసిందే. ఇలాంటి పరిస్థితిలో, ఛాంపియన్స్ ట్రోఫీని దృష్టిలో ఉంచుకుని టీం ఇండియా జడ్డును విస్మరిస్తుందో లేదో చూడాలి. ఎందుకంటే అతనికి చాలా అనుభవం ఉంది.

## జాక్వెస్ కల్లీస్ ఆల్‌టైమ్ గ్రేటెస్ట్ క్రికెటర్

### ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ రికీ పాంటింగ్



ప్రపంచంలోనే అత్యుత్తమ క్రికెటర్ ఎవరా? అని ప్రశ్నిస్తే ఎక్కువ మంది టీమిండియా దిగ్గజం, క్రికెట్ గాడ్ సచిన్ టెండూల్కర్ పేరు చెబుతారు. ఇంకొందరు విరాట్ కోహ్లీ, వీవీ రిచర్డ్స్, గ్యారీ సోబర్స్, ముత్తయ్య మురళీధరన్ వంటి దిగ్గజాల పేర్లను సూచిస్తారు. కానీ, ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ రికీ పాంటింగ్ మాత్రం కొత్త పేరును సూచించాడు. సౌతాఫ్రికా దిగ్గజ ఆల్‌రౌండర్ జాక్వెస్ కల్లీస్ ఆల్‌టైమ్ గ్రేటెస్ట్ క్రికెటర్ అని పేర్కొన్నాడు. ‘జాక్వెస్ కల్లిస్ ఆల్‌టైమ్ గ్రేటెస్ట్ క్రికెటర్. మిగతా వారి గురించి నాకు తెలియదు. నా దృష్టిలో మాత్రం కల్లిస్ అత్యుత్తమ క్రికెటర్. టెస్ట్‌ల్లో 13 వేల పరుగులతో పాటు 45 సెంచరీలు, 300 వికెట్లు తీసాడు. మిగతా వారంతా తమ కెరీర్‌లో బ్యాటింగ్ లేదా బౌలింగ్‌లో మాత్రమే అత్యుత్తమ గణంకాలు నమోదు చేశారు. కానీ కల్లిస్‌లా అత్యుత్తమ ఆల్‌రౌండ్ ప్రదర్శన కనబర్చలేదు. కల్లిస్ ఫీల్డింగ్ కూడా అసాధారణం. స్లిప్స్‌లో అతను అసాధారణ ఫీల్డర్. కానీ అతనికి రావాల్సిన గుర్తింపు రాలేదు. ఎందుకంటే కల్లిస్ వ్యక్తిత్వం భిన్నంగా ఉంటుంది. అతను ఎక్కువగా మాట్లాడాడు. దాంతో అతన్ని మీడియా ఎక్కువగా హైలైట్ చేయలేదు.’అని రికీ పాంటింగ్ చెప్పుకొచ్చాడు. జాక్వస్ కల్లీస్ 19 ఏళ్ల తన సుదీర్ఘ కెరీర్‌లో సౌతాఫ్రికా తరఫున 166 టెస్ట్‌లు, 328 వన్డేలు ఆడాడు. టెస్ట్‌ల్లో 13289 పరుగులు చేశాడు. టెస్ట్‌ల్లో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్ల జాబితాలో సచిన్(15,291), రికీ పాంటింగ్(13,378) తర్వాతి స్థానంలో నిలిచాడు. వన్డేల్లోనూ 11,579 పరుగులు నమోదు చేశాడు. 519 అంతర్జాతీయ మ్యాచ్‌ల్లో 338 క్యాచ్‌లు అందుకున్నాడు.

# స్పోర్ట్స్

## 9000 పరుగులు పూర్తి చేసిన ఆండ్రీ రస్సెల్



ప్రస్తుతం, టెస్ట్, వన్డేల కంటే ఎక్కువ టీ20 క్రికెట్ జరుగుతోంది. చాలా మంది అభిమానులు కూడా ఈ ఫార్మాట్ చూడటానికి ఇష్టపడుతున్నారు. అందుకే ఇప్పుడు చాలా దేశాలలో ప్రైవేట్ టీ20 టోర్నమెంట్లు జరుగుతున్నాయి. టీ20 క్రికెట్‌లో ఒకదాని తర్వాత ఒకటి భారీ రికార్డులు నమోదవడానికి ఇది కూడా ఒక పెద్ద కారణం. ఇటీవల కేకేఆర్ స్టార్ ఆటగాడు ఆండ్రీ రస్సెల్ తన పేరు మీద ఒక భారీ రికార్డును నమోదు చేసుకున్నాడు. నిజానికి, టీ20 క్రికెట్‌లో అతి తక్కువ బంతుల్లో 9 వేల పరుగులు పూర్తి చేసిన ఆటగాడిగా రస్సెల్ నిలిచాడు. దుబాయ్‌లో జరుగుతున్న అంతర్జాతీయ టీ20 లీగ్‌లోని 27వ మ్యాచ్‌లో ఆడుతున్నప్పుడు అతను ఈ ఘనతను సాధించాడు. టీ20 క్రికెట్‌లో అతి తక్కువ బంతుల్లో 9 వేల పరుగులు పూర్తి చేసిన వారిలో ఆండ్రీ రస్సెల్ ముందంజలో ఉన్నాడు. ఈ మైలురాయిని సాధించడానికి ఈ తుఫాన్ కుడిచేతి వాటం బ్యాట్స్‌మన్ 5321 బంతులను ఎదుర్కొన్నాడు. రస్సెల్ ఇప్పటివరకు ఆడిన 538 టీ20 మ్యాచ్‌ల్లో 26 కంటే ఎక్కువ సగటుతో 9008 పరుగులు చేశాడు. ఇందులో అతను 2 సెంచరీలు, 21 అర్ధ సెంచరీలు చేశాడు. ఈ జాబితాలో ఆస్ట్రేలియా స్టార్ బ్యాట్స్‌మన్ గ్లెన్ మాక్స్‌వెల్ రెండవ స్థానంలో ఉన్నాడు. మాక్స్వెల్ టీ20 ఫార్మాట్‌లో అత్యంత ప్రమాదకరమైన బ్యాట్స్‌మెన్‌లలో ఒకడిగా పేరుగాంచాడు. అతను ప్రపంచవ్యాప్తంగా వివిధ టీ20 లీగ్‌లలో నిరంతరం ఆడుతున్నాడు. టీ20 క్రికెట్‌లో 9000 పరుగుల మైలురాయిని దాటడానికి మాక్స్‌వెల్ 5915 బంతులు తీసుకున్నాడు. మాక్స్వెల్ ఇప్పటివరకు ఆడిన 459 మ్యాచ్‌ల్లో 10 వేలకు పైగా పరుగులు సాధించాడు.

# మళ్లీ అదే తప్పు చేస్తున్న పూజ, శ్రీలీల



రాఘవేంద్ర రావు పర్యవేక్షణలో పెళ్లి సందడి సినిమాతో వెండితెరకు పరిచయం అయిన బ్యూటీ శ్రీలీల. తొలి మూవీతోనే అందం అభినయంతో పాటు బెస్ట్ డ్యాన్సర్‌గా కూడా పేరు తెచ్చుకున్నారు ఈ బ్యూటీ. ఆ తరువాత ధమాకా, భగవంత్ కేసరి లాంటి హిట్స్ వచ్చినా... స్కంద, ఆదికేశవ లాంటి మూవీస్ అమ్మడి కెరీర్‌ను కష్టాల్లో పడేశాయి. ఒకేసారి నాలుగైదు సినిమాలకు కమిట్ అవ్వటంతో అన్ని సినిమాలకు సరిగా డేట్స్ అడ్జస్ట్ చేయలేక ఇబ్బంది పడ్డారు శ్రీలీల. ఈ విషయంలో కొన్ని విమర్శలు కూడా ఎదుర్కొన్నారు.



అదే సమయంలో వరుస ఫ్లాప్‌లతో కెరీర్ గాడి తప్పింది. ఇప్పుడు మళ్లీ అవకాశాలు వస్తున్నా.. అమ్మడి తీరు మాత్రం మారటం లేదు. మరోసారి ఎడా పెడా సినిమాలకు ఓకే చెప్పేసి డేట్స్ విషయంలో ఇబ్బంది పడుతున్నారు ఈ క్యూట్ బ్యూటీ.ఆ మధ్య వరుస సినిమాలతో పాన్ ఇండియా రేసులో ఫ్లాష్ అయిన పూజ హెగ్డే తరువాత సడన్‌గా స్లో అయ్యారు. రాధేశ్యామ్ లాంటి సినిమాలు తన కెరీర్‌ను మలుపు తిప్పుతాయన్న ఆశలతో వచ్చిన అవకాశాలు వదులుకొని ఇబ్బందుల్లో పడ్డారు.ఆ టైమ్‌లోనే కాలు ఫ్యాక్చర్ కావటంతో పూజ కెరీర్‌లో గ్యాప్ వచ్చింది.ఇప్పుడు మళ్లీ వరుస సినిమాలతో బిజీ అవుతున్న పూజా హెగ్డే, మరోసారి పాత తప్పునే రిపీట్ చేస్తున్నారన్న టాక్ వినిపిస్తోంది.రిలీజ్‌కు రెడీ అవుతున్న సినిమాల రిజల్ట్ చూశాకే కొత్త సినిమాలకు సైన్ చేయాలనుకుంటున్నారు పూజా. అందుకే తనని వెతుక్కుంటూ వస్తున్న ప్రాజెక్ట్స్‌ను కూడా వదులుకుంటున్నారు. దీంతో మరోసారి పూజ కెరీర్ గాడి తప్పుతోందా అని టెన్షన్ పడుతున్నారు ఫ్యాన్స్.



# పెళ్లై సంవత్సరం కాకముందే అలా చేశావేంటి కీర్తి..

## హీరోయిన్‌పై ఫ్యాన్స్ ఫైర్!


ముఖ్యంగా ఈ అమ్మడు మహానటి సినిమాతో మంచి క్రేజ్ సంపాదించుకుందనే చెప్పాలి. ఈ మూవీలో కీర్తి నటనకు అందరూ ఫిదా అయిపోయారు.ఇక కీర్తి సురేష్ ఇటీవలే తన చిన్న నాటి స్నేహితుడు ఆంటోని థట్టిల్‌ను తన కుటుంబ సభ్యుల సమక్షంలో వివాహం చేసుకున్న విషయం తెలిసిందే.వివాహం తర్వాత కీర్తి పసుపు తాడుతో పలు సార్లు మీడియా కంట చిక్కింది. దీంతో అందరూ ఈ నటి తెగ పొగిడేశారు. మెడలో తాళితో కీర్తి చాలా అందంగా ఉంది. తాను వివాహానికి మంచి గౌరవం ఇస్తుందన్నారు. అయితే తాజాగా ఈ ముద్దుగుమ్మ నటించిన బాలీవుడ్ మూవీ అక్క టీజర్ విడుదల చేయగా అందులో ఈ అమ్మడు తాళి లేకుండా కనిపించారు.కీర్తి మెడలో బంగారు ఆభరణాలు ధరించింది కానీ, తాళి మాత్రం లేదు. దీంతో ఈ బ్యూటీ అభిమానులు షాక్ అయ్యారు. పెళ్లై సంవత్సరం కాకముందే తాళి ధరించడం మానేశావా అంటూ పలు రకాల కామెంట్స్ చేస్తున్నారు నెటిజన్స్.

# విజయ్ సేతుపతి చేతుల మీదుగా తలా ట్రైలర్




రణం' దర్శకుడుగా సత్తా చాటారు అమ్మ రాజశేఖర్. తాజాగా అయన 'తలా' చిత్రానికి దర్శకత్వం వహించారు. ఇటీవల విడుదలైన తెలుగు ట్రైలర్ కు అద్భుతమైన స్పందన వచ్చింది. ఈ చిత్రంతో అమ్మ రాజశేఖర్ తనయుడు అమ్మ రాగిన్ రాజ్ హీరోగా పరిచయం అవుతున్నారు. తాజాగా ఈ మూవీ తమిళ్ ట్రైలర్ ను వెర్సటైల్ ప్యాన్ ఇండియా యాక్టర్ విజయ్ సేతుపతి చేతుల మీదుగా విడుదల చేశారు. అయన ట్రైలర్ కు ఇంప్రెస్ అయ్యి స్టార్ హీరో రేంజ్ సినిమాల ఉందని ప్రశంసించారు. ఇలాంటి మూవీతో డెబ్యూ ఇవ్వడం అనేది ఖచ్చితంగా రాగిన్ రాజ్ కు చాలా పెద్ద కెరీర్ ను ఇస్తుందని కితాబునిచ్చాడు. తమిళ్ లో ఈ చిత్రం పెద్ద విజయం సాధించాలని ఆకాంక్షించారు. విజయ్ సేతుపతి ఇచ్చిన ఫీడ్ బ్యాక్ తమ టీం కి ఏంటో ఎనర్జీ ఇచ్చిందని అమ్మ రాజశేఖర్పా అన్నారు. ఈ నెల 14న వాలెంటైన్స్ డే సందర్భంగా 'తలా' చిత్రం విడుదల కానుంది. ఈ చిత్రాన్ని 'వయొలెంట్ వాలెంటైన్'అనే పేరుతో ప్రమోషన్స్ చేస్తూ విడుదల చేయబోతుండటం విశేష

# పెళ్లి పీటలెక్కనున్న పార్వతి నాయర్



మలయాళ ప్రముఖ హీరోయిన్ పార్వతి నాయర్ త్వరలోనే పెళ్లిపీటలెక్కనుంది. ఓ వ్యాపార వేత్తతో కలిసి ఆమె ఏడడుగులు నడవనుంది. చెన్నైకి చెందిన వ్యాపారవేత్త ఆశ్రిత్ అశోక్ తో ప్రేమలో ఉన్న ఆమె త్వరలోనే ఏడడుగులు వేస్తున్నట్లు అధికారికంగా ప్రకటించింది. అంతేకాదు తమ నిశ్చితార్థం జరిగినట్లు సోషల్ మీడియాలో ఫొటోలను కూడా షేర్ చేసింది. దీంతో కొద్ది క్షణాల్లోనే ఈ ఫొటోలు వైరల్ గా మారాయి. కుటుంబ సభ్యులతో పాటు పలువురు సినీ ప్రముఖులు, అభిమానులు, నెటిజన్లు పార్వతి నాయర్– అశోక్ లకు అభినందనలు, శుభాకాంక్షలు తెలుపుతున్నారు. 'మైసూర్ శాండల్' సోప్ బ్రాండ్ అంబాసిడర్‌గా పార్వతి నాయర్ పేరు మార్మోగిపోయింది. ఇప్పటి వరకు సుమారు 30కి పైగా చిత్రాల్లో నటించిందీ అందాల తార. తెలుగులో న్యాచురల్ స్టార్ నాని నటించిన జెండాపై కపిరాజు సినిమాలో పార్వతి నాయర్ పాత్రలో మెప్పించింది. గతేడాది విజయ్ నటించిన ది గోట్ చిత్రంలోనూ ఓ కీలక పాత్రలో మెరిసిందీ అందాల తార.



# చంకీల చీరకట్టి.. అప్సరలా మెరిసిపోతున్న రకుల్!

ఇక టాలీవుడ్‌లో ఆఫర్స్ లేకపోవడంతో బాలీవుడ్ చెక్కేసిన రకుల్ అక్కడే వరసగా సినిమాలు, వెబ్ సిరీస్‌లు చేస్తున్న విషయం తెలిసిందే.అంతే కాకుండా బాలీవుడ్ నిర్మాత జాకీ భగ్నానీ వివాహం చేసుకుంది ఈ బ్యూటీ. ఇక ఈ మధ్య రకుల్ వరస ఫొటో షూట్స్‌తో కుర్రకారును ఫిదా చేస్తుంది.తాజాగా రకుల్ ప్రీత్ సింగ్ చంకీలు ఉన్న క్రీం కలర్ సారీలో మెరిపోయింది. ఈ చీరలో ఈ అమ్మడు అచ్చం అప్సరాలా కనిపిస్తుంది.అయితే ఈ ముద్దుగుమ్మ మెరీ హస్బెండ్ మూవీ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా ఇంత ముద్దుగా ముస్తాబైనట్లు తెలుస్తోంది.ప్రస్తుతం రకుల్ ఈ ఫొటోలను తన ఇన్‌స్టాలో షేర్ చేయడంతో అవి నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి. కాగా, ఆఫొటోస్ పై మీరు ఓ లుక్ వేయండి.

Printed published and woned by Tarigolpula Lakshmi, mahender ,printers karshak Art Printers, Hyderabad and published by office 2-6-376, Jaipuri colony,Nogole village,Uppal mandal, district Ranga Reddy,Post GSI,500068-Telangana RNI NO.APTEL/2012/46853 . Email ID : Prajaswecha@gmail.com, website, www.Prajaswecha.com cell 9381910611, 79892 89492